ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శనివారం | 10-10- 2026 | సంపుటి: 17, సంచిక: 189, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

భూ వివాద రహిత

తెలంగాణే లక్ష్యం

ఏడాదిన్నరలో సమగ్ర భూసర్వే పూర్తి చేస్తాం



సర్వే పర్యవేక్షణకు 7 జోన్లకు 14 మంది అధికారుల నియామకం

నాణ్యత, పారదర్శకత, వేగం.. రీ-సర్వేలో అత్యంత కీలకం

ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 9 (ప్రజాకలం) :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర రీ-సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికారులతో భూ సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ సర్వేలో వేగం ,నాణ్యతతో పాటు ప్రతి దశలో నిరంతర పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు లభించిన ఈ అవకాశాన్ని అధికారులు అత్యంత బాధ్యతతో వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. రీ-సర్వేను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు 7 జోన్లకు ఒక్కో జోన్‌కు రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించినట్లు మంత్రి తెలిపారు. సర్వే జరుగుతున్న తీరును, నాణ్యతను, ప్రజల స్పందనను ఎప్పటికప్పుడు పరిశీలించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో తొలి దశలో 365 నక్షాలేని గ్రామాల్లో అలాగే జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2,240 మొత్తం 2768 గ్రామాల్లో రీసర్వే ముమ్మరంగా

తరువాయి 2వ పేజీలో...



మెడికవర్‌కు రాజకీయ రంగు పులమొద్దు!

ఏ పార్టీతోనూ ప్రత్యేక అనుబంధం లేదు

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే మా లక్ష్యం

సికింద్రాబాద్ ఆసుపత్రిలో ఏడాదిలో 15 వేల మందికి పైగా ఇన్‌పేషెంట్లకు చికిత్స

అన్ని పార్టీల నేతలూ మా ఆసుపత్రులను ప్రారంభించారు

రోగుల్లో భయాందోళనలు సృష్టించేలా దుష్ప్రచారం చేయడం తగదు

మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా సీఓఓ మహేష్ డెగ్లోర్కర్

హైదరాబాద్ అక్టోబర్ 09 (ప్రజాకలం ప్రతినిధి):

మెడికవర్ హాస్పిటల్స్‌కు ఏ రాజకీయ పార్టీతోనూ ప్రత్యేక అనుబంధం లేదని, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆ సంస్థ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహేష్ డెగ్లోర్కర్ స్పష్టం చేశారు. ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరైనంత మాత్రాన రాజకీయ సంబంధాలు ఆపాదించడం సరికాదన్నారు. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా కొన్ని యూట్యూబ్ ఛానెళ్లలో

తరువాయి 2వ పేజీలో...

కవిత కీలక విజ్ఞప్తి

గ్రాడ్యుయేట్ల ఓటుతో కాంగ్రెస్‌కు సమాధానం చెప్పాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఓటరుగా కవిత నమోదు

తమ పార్టీ అభ్యర్థులకు మద్దతివ్వాలని విజ్ఞప్తి



హైదరాబాద్, అక్టోబరు 9 (ప్రజాకలం) :

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత గ్రాడ్యుయేట్ ఓటర్లకు పిలుపు నిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఆమె ఓటరుగా నమోదు చేసుకున్నారు. ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరు తూ, ఓటు హక్కు కలిగిన గ్రాడ్యుయేట్లు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలని విజ్ఞప్తి చేశారు.

తరువాయి 2వ పేజీలో...

రామచందర్ రావు ఫైర్

స్టార్‌లింక్ వివాదం.. రాహుల్‌ను టార్గెట్ చేసిన తెలంగాణ బీజేపీ



హైదరాబాద్, అక్టోబరు 9 (ప్రజాకలం) :

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌పై విదేశీ ప్రముఖులు విమర్శలు చేసినప్పుడు రాహుల్ వారికి మద్దతుగా మాట్లాడుతున్నారని, ఇది దేశ ప్రయోజనాలకు విరుద్ధమని ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వ్యాపారవేత్త ఎలాన్ మస్క్‌ల వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన ఈ విమర్శలు చేశారు.

ట్రంప్, మస్క్ వ్యాఖ్యలపై రాహుల్ స్పందన ఏంటి?

మీడియాతో మాట్లాడిన రామచందర్ రావు.. భారత్‌పై అమెరికా నుంచి ఎవరైనా విమర్శలు చేసినప్పుడు రాహుల్ గాంధీ వెంటనే స్పందిస్తున్నారని ఆరోపించారు. ట్రంప్ భారత్‌పై 100 శాతం సుంకాలు విధిస్తామని వ్యాఖ్యానించినప్పుడు రాహుల్ స్పందించలేదని, కానీ Starlink సేవలకు

తరువాయి 2వ పేజీలో...

నవీ పిళ్లైకి నోబెల్

శాంతి పురస్కారం

మానవ హక్కుల పరిరక్షణకు అంతర్జాతీయ గుర్తింపు



న్యూఢిల్లీ: మానవ హక్కుల పరిరక్షణ, అంతర్జాతీయ న్యాయవ్యవస్థ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన దక్షిణాఫ్రికా న్యాయవాది నవనీతమ్ 'నవీ' పిళ్లైకి 2026 నోబెల్ శాంతి పురస్కారం లభించింది. తమిళ మూలాలున్న ఆమెకు ప్రపంచ వ్యాప్తంగా న్యాయం, మానవ హక్కుల కోసం చేసిన సేవలకు ఈ గౌరవం దక్కింది.

అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట సేవలు

నవీ పిళ్లై తన న్యాయవృత్తిలో వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన వారికి అండగా నిలిచారు. దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా

తరువాయి 2వ పేజీలో...

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు

85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్

సెక్రటేరియట్ లో IRC ఏర్పాట్లపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సుదీర్ఘ సమీక్ష

కనీవినీ ఎరగని రీతిలో, తెలంగాణ ఖ్యాతి చాటేలా ఏర్పాట్లు ఉండాలని అధికారులకు ఆదేశం

3,000 మంది డెలిగేట్స్, 400 ఎగ్జిబిషన్ స్టాళ్లతో, హైటెక్స్‌లో నాలుగు రోజుల పాటు జాతీయ స్థాయి సదస్సు

ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఇతర రాష్ట్రాల మంత్రులు

హైదరాబాద్, అక్టోబరు 9 (ప్రజాకలం) :

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు హైటెక్స్‌లో నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ జాతీయ సదస్సు ఏర్పాట్లపై శుక్రవారం డా.బీ.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. సుమారు నాలుగు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో IRC సెక్రటరీ జనరల్ రాహుల్ గుప్తా, IRC డైరెక్టర్ సురేందర్ గర్గ్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, MoRTH రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,ఐ అండ్ పీఆర్ కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ చీఫ్ ఇంజనీర్లు ధర్మారెడ్డి,వసంత్ నాయక్,బి.వి రావు,నర్సింగరావు పలువురు ఆర్ అండ్ బీ ఇంజనీర్లు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..



85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను హైదరాబాద్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి వచ్చే అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, రవాణా, ఆహారం, ఆతిథ్యం, పర్యాటక ప్రాంతాల సందర్శన తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. రాబోయే గ్లోబల్ సమ్మిట్ తరహాలో ఈ జాతీయ సదస్సు ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. IRC విజయవంతం కోసం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిసెంబర్ లో నిర్వహించ బోయే "ఇన్వెస్ట్ తెలంగాణ"(గ్లోబల్ సమ్మిట్)లో

తరువాయి 2వ పేజీలో...

గుడ్డు పోషక విలువలపై

ప్రజల్లో అవగాహన పెంచాలి

పౌల్ట్రీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది

ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణమే లక్ష్యం: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, అక్టోబరు 9 (ప్రజాకలం) :

ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని, అందులో గుడ్డు ఎంతో ముఖ్యమైనదని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు ఉ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. అంతర్జాతీయ ఎగ్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో గుడ్డు పోషక విలువలపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

గుడ్డు పోషకాహారానికి చక్కని మార్గం

గుడ్డు, పాలు, మాంసం వంటి పోషకాహార పదార్థాల వినియోగంపై సమాజంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, సమతుల ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో అవసరమని మంత్రి అన్నారు. ముఖ్యంగా పిల్లలు, యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదగడానికి పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరికీ గుడ్డు పోషక విలువల గురించి తెలియజేయాలని సూచించారు.

ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి



జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా ఆరోగ్యం బాగాలేకపోతే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి పేర్కొన్నారు. తాను కూడా ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని వ్యక్తిగత అనుభవాల ద్వారా తెలుసుకున్నానని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు.

పౌల్ట్రీ రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గుడ్డు ఉత్పత్తి అనేది కేవలం కోళ్ల పెంపకానికే పరిమితం కాదని, దాని వెనుక రైతులు, పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు, పశు వైద్యులు, శాస్త్రవేత్తలు, రవాణా, మార్కెటింగ్ రంగాలకు చెందిన అనేక మంది శ్రమ దాగి ఉందని మంత్రి అన్నారు. పౌల్ట్రీ రంగం అభివృద్ధి చెందితే రైతులకు ఉపాధి, ప్రజలకు పోషకాహారం అందుబాటులోకి రావడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నట్లే పౌల్ట్రీ రంగంలోని సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తరువాయి 2వ పేజీలో...

మెడికవర్‌కు రాజకీయ రంగు పులమొద్దు! రామచందర్ రావు ఫైర్

మొదటి పేజీ తరువాయి...

ప్రతికూల కథనాలు ప్రసారం చేయడం వల్ల రోగులు, వారి కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొనే ప్రమాదముందని పేర్కొన్నారు.

వివిధ పార్టీల నేతలతో ప్రారంభోత్సవాలు

తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవం జరిగిందని డెగ్లోర్కర్ గుర్తుచేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కూడా ఆసుపత్రి ప్రారంభోత్సవం జరిగిందన్నారు. సికింద్రాబాద్‌లోని ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరయ్యారని తెలిపారు. బేగంపేటలోని ఆసుపత్రి ప్రారంభోత్సవానికి అప్పటి మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారని వివరించారు. మహారాష్ట్రలోనూ శరద్ పవార్, ఏక్‌నాథ్ షిండే, దేవేంద్ర ఫడ్నవీస్ వంటి ప్రముఖ నాయకులు మెడికవర్ ఆసుపత్రుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు ప్రభుత్వాల హయాంలో ప్రజాప్రతినిధులు కార్యక్రమాలకు హాజరుకావడాన్ని రాజకీయ అనుబంధంగా చూడకూడదన్నారు.

ఏడాదిలోనే 15 వేల మందికి వైద్య సేవలు

సికింద్రాబాద్ ఆసుపత్రి ప్రారంభమైన ఏడాదిలోనే 15 వేల మందికి పైగా ఇన్‌పేషెంట్లకు సేవలు అందించిందని డెగ్లోర్కర్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి సంక్లిష్ట ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వాస్తవాలను పరిశీలించకుండా ఉద్దేశపూర్వకంగా ప్రతికూల ప్రచారం చేయడం సరికాదన్నారు.

ధ్రువీకరించని ప్రచారంతో ఆందోళన

రోగుల ఆరోగ్య పరిస్థితులు, వ్యాధి తీవ్రత, చికిత్స వివరాలను పూర్తిగా పరిశీలించకుండా కథనాలు ప్రసారం చేస్తే ప్రజల్లో అపోహలు ఏర్పడే అవకాశం ఉందని డెగ్లోర్కర్ అన్నారు. రోగుల మరణాలకు సంబంధించిన అంశాలపై వైద్యపరమైన వివరాలు, వాస్తవాల ఆధారంగా చర్చ జరగాలని సూచించారు. ధ్రువీకరించని సమాచారంతో ఆసుపత్రి ప్రతిష్ఠను దెబ్బతీయడం వల్ల రోగులు, వారి కుటుంబ సభ్యులు అనవసర ఆందోళనకు గురవుతారని పేర్కొన్నారు.

తమ సంస్థకు రాజకీయాల కంటే రోగులకు మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమని స్పష్టం చేశారు. ఆసుపత్రిపై వచ్చే ఆరోపణలను ఆధారాలతో పరిశీలించాలని, నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించవద్దని కోరారు.

భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

సాగుతుందని ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ సర్వేను పర్యవేక్షించేందుకు 14 మంది అధికారులను పర్యవేక్షకులుగా నియమించడం జరిగిందని తెలిపారు. మొదటి దశ సర్వేను నవంబర్ చివరినాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే తప్పనిసరిగా చేపట్టేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో లైసెన్స్‌డ్ సర్వేయర్, జీపీవో, డిప్యూటీ తహసీల్దార్ లేదా ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బంది ఉంటారని వివరించారు.

సర్వే జరుగుతున్న ప్రాంతాల్లో ప్రతి రోజు తహసీల్దార్ పర్యటించి పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ రోజు ఎక్కడ సర్వే జరిగింది? ఎన్ని ఎకరాలు/సర్వే నంబర్లు పూర్తయ్యాయి? ఎన్ని గ్రామాల్లో వని జరుగుతోంది? ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది? సర్వేలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అనే అంశాలపై అధికారులు ప్రతిరోజూ స్పష్టమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా, భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ-సర్వే జరగాలని మంత్రిగారు స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డు

రీ-సర్వేను రాష్ట్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే పురోగతి, రోజువారీ పనితీరు, గ్రామాల వారీగా పూర్తయిన సర్వే, పనిచేస్తున్న సర్వే బృందాలు, ఉపయోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి వివరాలన్నీ డాష్‌బోర్డులో రియల్‌టైమ్‌లో కనిపించేలా టెక్నాలజీని వినియోగించాలని సూచించారు.

సర్వేకు అవసరమైన సర్వేయర్లు, రోవర్లు, సర్వర్లు, ఇతర సాంకేతిక పరికరాలు, సామగ్రి కొనుగోలుకు నిధుల కొరత ఉండదని స్పష్టం చేశారు. అవసరమైన నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేస్తుందని, అదనపు రోవర్లను కూడా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

రీ-సర్వే ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైనదని ప్రతి వారం రాష్ట్రస్థాయిలో అధికారులు సమీక్ష నిర్వహించాలని, ప్రతి 15 రోజులకు తాను స్వయంగా సమీక్షించి పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు.ప్రభుత్వ భూముల సర్వే సమయంలో సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

రీ-సర్వే పేరుతో స్థానికంగా ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మంత్రిగారు హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మీడియా చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి

శుక్రవారం నాడు సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ

ఎర్రవల్లి లో 385 ఎకరాలలో 45 ఎకరాలు తక్కువ ఉందని. సర్వే కోసం మరొక సారి నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎర్రవల్లిలో అసైన్డ్ భూములు కొన్ని చేతులు మారాయి వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అమరవీరులను గుర్తించి వాళ్లకు న్యాయం చేస్తామన్నారు. ఎర్రవెల్లిలో కూడా నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ ల్యాండ్ ఉంటే వాటిని పేదలకు పంచుతామన్నారు.

కవిత కీలక విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి...

ప్రశ్నించే గొంతుకకు మద్దతివ్వాలి

టీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకగా నిలుస్తుందని కవిత పేర్కొన్నారు. రెండు స్థానాల్లో సమర్థులైన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. తమ పార్టీకి మద్దతు ఇవ్వాలనుకునేవారు కూడా ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగాలపై కాంగ్రెస్‌ను నిలదీయాలి

రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు, జాబ్ క్యాలెండర్ అమలు, విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కవిత విమర్శించారు. నిరుద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుని ప్రభుత్వ పనితీరుపై తమ అభిప్రాయాన్నితెలియజేయాలని గ్రాడ్యుయేట్లకు పిలుపునిచ్చారు. ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల అభివృద్ధి వంటి అంశాలపై ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా ఓటు వేయాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై రాజకీయ వేడి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు, అభ్యర్థుల ఎంపిక, నిరుద్యోగ సమస్యలు రాజకీయ చర్చలో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ల మద్దతు కూడగట్టేందుకు కవిత చేసిన విజ్ఞప్తి ప్రాధాన్యం సంతరించుకుంది.

గుడ్డు పోషక విలువలపై ప్రజల్లో అవగాహన పెంచాలి



మొదటి పేజీ తరువాయి...

పరిశ్రమ ప్రతినిధులు, పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రజల్లో అవగాహన
పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు

పాఠశాల స్థాయి నుంచే పోషకాహారం ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. పిల్లలకు గుడ్డు అందించే కార్యక్రమాల ప్రాముఖ్యతను గుర్తించి, పోషకాహారంపై అవగాహనను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు, మారుమూల గిరిజన తండాల వరకు గుడ్డు వినియోగం, పోషక విలువలపై ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన గుడ్లు అందించడం ఎంత ముఖ్యమో, వాటి ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా సంబంధిత వర్గాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

పౌల్ట్రీ రంగానికి పూర్తి సహకారం

పౌల్ట్రీ రంగ అభివృద్ధికి అవసరమైన అంశాలను పరిశ్రమ ప్రతినిధులతో చర్చించి, ప్రభుత్వ స్థాయిలో పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం, రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, వైద్య నిపుణులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం ద్వారా గుడ్డు పోషక విలువలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు, పౌల్ట్రీ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు రవాణా అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, పౌల్ట్రీ రంగం యజమానులు, ముఖ్యులు పాల్గొన్నారు.

నవీ పిళ్లైకి నోబెల్ శాంతి పురస్కారం

మొదటి పేజీ తరువాయి...

పోరాడిన కార్యకర్తల తరఫున కూడా ఆమె పనిచేశారు. అంతర్జాతీయ స్థాయిలో యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగే నేరాలపై న్యాయపరమైన చర్యలకు ప్రాధాన్యం కల్పించడంలో ఆమె పాత్ర గుర్తింపు పొందింది.

ఐక్యరాజ్యసమితిలో కీలక బాధ్యతలు

2008 నుంచి 2014 వరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా నవీ పిళ్లై పనిచేశారు. అంతకుముందు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. అంతర్జాతీయ నేర న్యాయస్థానాల ద్వారా బాధితులకు న్యాయం అందించడంలో, మానవ హక్కుల ఉల్లంఘనలపై బాధ్యతను నిర్ధారించడంలో ఆమె కృషి విశేషం.

శాంతి, న్యాయవ్యవస్థ బలోపేతానికి గుర్తింపు

యుద్ధాలు, ఘర్షణల పరిష్కారంలో అంతర్జాతీయ చట్టాల ప్రాధాన్యాన్ని పెంపొందించడం, నేరాలకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టడం వంటి అంశాలకు ఆమె చేసిన సేవలను నోబెల్ శాంతి పురస్కారం గుర్తించింది. మానవ హక్కుల పరిరక్షణతో పాటు ప్రపంచవ్యాప్తంగా న్యాయ సూత్రాల అమలుకు ఆమె చేసిన కృషికి ఈ అవార్డు మరో ముఖ్యమైన గుర్తింపుగా నిలిచింది.

ఈ కథనం మీ సమాచారాన్ని ఆధారంగా తీసుకుని కొత్త పదప్రయోగంతో రూపొందించబడింది. ప్రచురణకు ముందు వాస్తవాలను ధృవీకరించడం మంచిది. నవీ పిళ్లై పదవుల వివరాలకు ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అధికారిక సమాచారం ఉపయోగించవచ్చు.

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు

85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...

పెట్టుబడులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

3,000 మంది ప్రతినిధులు..
400 ఎగ్జిబిషన్ స్టాళ్లు

ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మంత్రులు, కార్యదర్శులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇంజనీర్లు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి రహదారుల నిపుణులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులు కలిపి సుమారు 3,000 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని మంత్రి తెలిపారు. హైటెక్స్‌లో సుమారు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా రహదారుల నిర్మాణం, ఆధునిక సాంకేతికత, భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, నిపుణులు ఒకే వేదికపై సమావేశం కావడం వల్ల తెలంగాణకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించడంతో పాటు పెట్టుబడులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

సదస్సుకు హాజరయ్యే ప్రతినిధుల కోసం ప్రతి అతిథికి, విమానాశ్రయంలో స్వాగతం పలకడం నుంచి తిరుగు ప్రయాణంలో విమానం ఎక్కించే వరకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా, విభాగాల వారిగా నోడల్ అధికారులను నియమించుకొని పర్యవేక్షణ చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్లు, వారికి కేటాయించిన ఇంచార్జి బాధ్యతలు సక్రమంగా నిర్వహించి ప్రోగ్రాం సక్సెస్ చేయాలని సూచించారు.

నాలుగు రోజుల కార్యక్రమాల షెడ్యూల్

నవంబర్ 19వ తేదీ ఉదయం 11 గంటలకు IRC ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. తాను, రాష్ట్రానికి చెందిన ఇతర మంత్రులు, ఇతర రాష్ట్రాల మంత్రులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, ప్రముఖులు కూడా పాల్గొంటారని చెప్పారు.

ఆ తర్వాత రహదారుల నిర్మాణం, భద్రత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై అంతర్గత చర్చలు, నిపుణులతో గ్రూప్ డిస్కషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఐఐటీ విద్యార్థులు, తెలంగాణలోని ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు, రహదారుల రంగ నిపుణులను కూడా ఈ చర్చల్లో భాగస్వాములను చేస్తామని చెప్పారు.నవంబర్ 19వ తేదీ రాత్రి హైటెక్స్‌లో ముఖ్యమంత్రి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అతిథులు, నిపుణులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తారని తెలిపారు. నవంబర్ 20న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో చర్చలు కొనసాగుతాయని, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, శాఖాధిపతులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. నవంబర్ 21న ముగింపు కార్యక్రమం నిర్వహించి, గవర్నర్‌ను కూడా ఆహ్వానిస్తామని తెలిపారు. నవంబర్ 22వ తేదీ మధ్యాహ్నం ప్రతినిధుల తిరుగు ప్రయాణాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు

తెలంగాణ రాష్ట్రంలో IRC నిర్వహించాలని తాను వ్యక్తిగతంగా, లేఖ ద్వారా చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించే అవకాశం కల్పించినందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో గతంలో ఆరు సార్లు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నిర్వహించగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ కార్యక్రమం ఇక్కడ జరగడం ఇది రెండోసారి అని పేర్కొన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాలు హైదరాబాద్‌కు రావడం రాష్ట్ర ప్రతిష్టను పెంచడంతో పాటు, తెలంగాణ పెట్టుబడులకు అనుకూలమైన గమ్య స్థానంగా నిలుస్తుందన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయిన తర్వాత హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో విశ్వనగరంగా ఎదుగుతుందని, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులను ఆకర్షించే కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

త్వరలో హైదరాబాద్-విజయవాడ 6o2 లేన్ల రహదారి పనులు

హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం NH-65ను ఆరు ప్రధాన లేన్లు, రెండు సర్వీస్ లేన్లతో విస్తరించేందుకు రూ. 12,073 కోట్లతో ఇప్పటికే ఆమోదం లభించిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సాంకేతిక కమిటీల ప్రక్రియ పూర్తయిందని, కేంద్ర మంత్రివర్గ కమిటీ ఆమోదం పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఇండియన్ రోడ్ కాంగ్రెస్ కార్యక్రమంలో, గుజరాత్‌లో జరిగిన చింతన్ శివిర్-2026లో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఈ ప్రాజెక్టును వేగవంతం చేయాలని కోరినట్లు వెల్లడించారు. తుది అనుమతులు లభించిన వెంటనే రెండు నెలల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనుల ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం ఈ రహదారిపై ట్రాఫిక్ భారీగా పెరిగిందని, అనేక ప్రమాదకర ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్లు ఉన్నాయని చెప్పారు. రహదారి విస్తరణతో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రోడ్డు భద్రత మెరుగుపడుతుందని, పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని వివరించారు.

RRR ఉత్తర భాగ భూ సేకరణ పూర్తి...

తెలంగాణ అభివృద్ధికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. సంగారెడ్డి-నర్సాపూర్-తూప్రాన్-గజ్వేల్-జగదేవ్‌పూర్-భువనగిరి-చౌటుప్పల్ మార్గంలో 161.518 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే రెండుసార్లు టెండర్లు పిలిచినప్పటికీ, భూసేకరణ పూర్తికాకపోవడంతో వాటిని రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో మరోసారి టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రక్రియను కూడా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఉత్తర భాగానికి త్వరితగతిన ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదాలు లభించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్లు వెల్లడించారు. హైదరాబాద్ చుట్టూ పూర్తి రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడానికి RRR దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతో సమానంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక పార్కులు, రేడియల్ రోడ్లు తదితర భవిష్యత్ మౌలిక వసతుల అభివృద్ధికి దక్షిణ RRR కీలకంగా మారుతుందని వివరించారు.

చీఎ-765పై
మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్

హైదరాబాద్-శ్రీశైలం NH-765లోని నల్లమల అటవీ ప్రాంతంలో మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలని మంత్రి కోరారు. సుమారు రూ. 7,600 కోట్ల అంచనా వ్యయంతో 52 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమైందని తెలిపారు.

టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో రహదారి విస్తరణకు ఎదురవుతున్న సమస్యలకు ఈ ఎలివేటెడ్ కారిడార్ పరిష్కారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. శ్రీశైలం వెళ్లే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడంతో పాటు నల్లమల అటవీ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని వివరించారు. ప్రాజెక్టుకు కేంద్ర స్థాయిలో అవసరమైన ఆమోదాలు త్వరగా లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గ్లోబల్ సమ్మిట్ స్థాయిలో IRC నిర్వహణ

ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను కేవలం ఒక సమావేశంగా కాకుండా, తెలంగాణ రహదారుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రోడ్డు భద్రత, పెట్టుబడుల ఆకర్షణకు ఉపయోగపడే వేదికగా తీర్చిదిద్దాలని మంత్రి అధికారులకు సూచించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణ ఆతిథ్య సంప్రదాయాన్ని చాటిచెప్పేలా ఏర్పాట్లు చేయాలని, ప్రతి విభాగం బాధ్యతతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని, తెలంగాణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచస్థాయికి తీసుకెళ్లేలా సమ్మిట్ – గ్లోబల్ సమ్మిట్‌పై అధికారులకు భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 9 (ప్రజాకలం) : డిసెంబర్ 7, 8, 9 తేదీలలో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0 కు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు సమన్వయంతో పనిచేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ కోసం ప్రజా భవన్ లో ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను శుక్రవారం ఆయన సందర్శించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. శాఖల మధ్య నిరంతర సమాచార మార్పిడి, సమన్వయం ఉండేలా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమ్మిట్ విజయవంతానికి ప్రతి శాఖ కృషి చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయంగా రాష్ట్ర ప్రతిష్ఠను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడానికి ప్రతి అధికారి సమష్టి బాధ్యతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక, ప్లానింగ్ ముఖ్య కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వాగ్దేవి పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబురాలు



తానూర్, అక్టోబర్ 9(ప్రజా కలం): మండల కేంద్రంలోని వాగ్దేవి విద్యానికేతన్ హైస్కూల్‌లో దసరా సెలవుల సందర్భంగా శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు, ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ప్రత్యేక పూజలు చేసి సంబరాలను ప్రారంభించారు,అనంతరం బతుకమ్మ చుట్టూ చేరి సాంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడారు,?తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని పాఠశాల డైరెక్టర్ పి. అరవింద్ రెడ్డి పేర్కొన్నారు,విద్యార్థులకు బతుకమ్మ పండుగా ప్రత్యేకతను తెలిపారు,ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు జి. అవినాష్, సుమలత, ప్రిన్సిపాల్ కిరణ్మయిలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీసాయి వాణి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు...



మల్హార్, అక్టోబర్ 09 ప్రజాకలం : మండల కేంద్రమైన తాడి చర్ల గ్రామం లోని శ్రీసాయివాణి పాఠశాల లో కరెస్పాండెంట్ సంపత్ రావు ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ పండుగ సంబురాలు నిర్వహించారు. రంగు రంగు పువ్వులతో బతుకమ్మ పేర్చి విద్యార్థులు నృత్యాలు చేశారు.ఈ కార్యక్రమం లో విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేశారు ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ సంపత్ రావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగను అందరూ ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణంలో గడువు ముగిసిన మాజా బాటిళ్లు

వినియోగదారుల ఆరోగ్య భద్రతపై ఆందోళన - ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించాలి!

పాలేరు, అక్టోబర్ 09(ప్రజా కలంన్యూస్)

ప్రజారోగ్య పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారా? ఒక దుకాణంలో మాజా పానీయాల విక్రయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూసుమంచి మండల కేంద్రంలోని ఓ ఊరు పేరు లేని ఓ టీ స్టాల్ లో గడువు ముగిసిన మాజా బాటిళ్లను యదేచ్ఛగా అమ్మకాలు జరుపుతున్నారు. దీనిపై వినియోగదారుడు సంబంధించిన టీ స్టాల్ నిర్వాహకుడిని నిలతీయగా కావాలంటే బాటిల్ మార్చుతాం అంటూ నిర్లక్ష్యంగా సమాధానమే చెప్పడం కాకుండా గడువు ముగిసిన బాటిల్ లు తమ షాపులో ఉన్నట్లు తమకు ముందే తెలుసు అనడం కోస మెరుపు.పానీయాల బాటిళ్లపై ముద్రించిన గడువు తేదీలను పరిశీలించకుండా విక్రయాలు జరిపితే వినియోగదారుల ఆరోగ్య భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు ఇలాంటి శీతల పానీయాలను ఎక్కువగా వినియోగించే నేపథ్యంలో దుకాణదారులు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుకునే స్థితికి దిగజారారు.



గడువు ముగిసిన మాజా బాటిళ్ల విక్రయాలపై ఆందోళన!

కూసుమంచి మండలంలో ఫుడ్ సెఫ్టీ అధికారుల తనిఖీలు లేకపోవడంతో, గడువు ముగిసిన బాటిల్ లు అని తెలిసి కూడా విక్రయాలు చేస్తున్నారు. అంటే దుకాణదారులు ప్రజారోగ్యంతో చెలగాటం అడడమే అనిపిస్తుంది.. నిరంతరం అధికారుల తనిఖీలు చేపట్టాల్సి ఉన్న తనిఖీలు లేకపోవడంతో యదేచ్ఛగా గడువు ముగిసిన పానీయాలను అమ్ముతున్నారు.. వినియోగదారుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన దుకాణాల్లో గడువు తేదీలను సరిగ్గా పరిశీలిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై విచారణ చేపట్టి సదరు షాపు పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అచ్చంపేట పట్టణ ప్రజలకు ఉపాధి హామీ పనులు కల్పించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా
- వి బి జీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి ఎంఎన్ ఆర్ ఈ జి ఎస్ ను కొనసాగించాలి
- జిల్లా అధ్యక్షులు ఎస్. మల్లేష్ డిమాండ్

నాగర్ కర్నూల్ అక్టోబర్ 09 ప్రజా కలం (ప్రతినిధి): అచ్చంపేట పట్టణ ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అచ్చంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ రమేష్ నాయక్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాకు పర్వతాలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. మల్లేష్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రతి ఒక్కరికీ సంవత్సరానికి 200 రోజుల పని కల్పించడంతో పాటు, రోజుకు రూ.800 కూలి చెల్లించాలని కోరారు. పట్టణ ప్రజలకు నిరంతరం సేవలందించేందుకు ప్రత్యేకంగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, వి.బి.జి. రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కొనసాగించాలని



డిమాండ్ చేశారు.

అచ్చంపేట పట్టణ ప్రజలకు ఉపాధి హామీ పనులు కల్పించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సైదులు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాములు, సీపీఎం సీనియర్ నాయకులు పర్వతాలు, కూలీలు వెంకటమ్మ, పెంటమ్మ, లక్ష్మి, నారాయణ, వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఆగండి.. ఆలోచించండి.. ఆ తర్వాతే అడుగు వేయండి
- సైబర్ నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జీ పాటిల్

నాగర్ కర్నూల్, అక్టోబర్ 09 (ప్రజా కలం): డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవడంతో పాటు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో అక్టోబర్ నెలను సైబర్ అవగాహన నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ పోస్టర్‌ను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు ప్రజల అమాయకత్వాన్ని, అత్యాశను ఆసరాగా చేసుకుని వివిధ పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడం ద్వారా ఇలాంటి మోసాలను గణనీయంగా నివారించవచ్చని పేర్కొన్నారు.



ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో మోసాలు

ఇంటి వద్ద నుంచే సులభంగా డబ్బు సంపాదించవచ్చని, ఆన్‌లైన్‌లో రేటింగ్స్ లేదా రివ్యూలు ఇస్తే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కల్పిస్తామని వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే సందేశాలను నమ్మవద్దని ఎస్పీ హెచ్చరించారు. ప్రారంభంలో కొంత మొత్తం చెల్లించి నమ్మకం కలిగించిన అనంతరం, అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టించి డబ్బులు కాజేసే అవకాశముందని తెలిపారు. అదేవిధంగా తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపే నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, క్రిప్టోకరెన్సీ పెట్టుబడి వంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థల విశ్వసనీయతను పరిశీలించాలని, అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దని స్పష్టం చేశారు.

వ్యక్తిగత వివరాలు ఎవరికీ వెల్లడించవద్దు

బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు సమాచారం, పిన్ నంబర్లు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, ఆధార్‌కు సంబంధించిన వివరాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. బ్యాంకు అధికారులు లేదా ఇతర ప్రభుత్వ సంస్థల ప్రతినిధులమని చెప్పి ఫోన్ చేసే వ్యక్తులకు రహస్య సమాచారాన్ని వెల్లడించకూడదని తెలిపారు. అపరిచిత నంబర్ల నుంచి వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని, మొబైల్ ఫోన్‌కు వచ్చే అనుమానాస్పద సందేశాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. స్క్రీన్ షేరింగ్ యాప్‌లను అపరిచితుల సూచనల మేరకు ఇన్‌స్టాల్ చేయడం, బ్యాంకింగ్ వివరాలను ఇతరులకు అందించడం వల్ల ఖాతాల్లోని డబ్బు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

మోసానికి గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి

సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సైబర్ క్రైమ్ ఫిర్యాదుల వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మోసానికి సంబంధించిన ఫోన్ నంబర్లు, బ్యాంకు లావాదేవీల వివరాలు, సందేశాలు, స్క్రీన్‌షాట్‌లు వంటి ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం వల్ల సంబంధిత లావాదేవీలపై సత్వర చర్యలు తీసుకునే అవకాశం పెరుగుతుందని పేర్కొన్నారు.

ఆగండి.. ఆలోచించండి.. అడుగు వేయండి

ప్రజలు సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేందుకు "ఆగండి – ఆలోచించండి – అడుగు వేయండి" అనే మూడంచెల సూత్రాన్ని పాటించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఏదైనా సందేశం లేదా ఫోన్ కాల్ ద్వారా డబ్బులు చెల్లించాలని, వ్యక్తిగత వివరాలు అందించాలని కోరితే ముందుగా దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు. సైబర్ నేరాల నివారణ పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడికి కూడా ఇందులో భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు కుటుంబ సభ్యులు, ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే వారికి సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ ఎస్ఐ గిరి మనోహర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ టీం సభ్యులు తేజశ్రీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జయహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెడ్ షీట్స్ పంపిణీ

(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 09, ప్రజాకలం ప్రతినిధి: మండలంలోని చింతనెక్కొండ గ్రామం విజ్ఞాన భారతి విద్యాలయంలో శుక్రవారం జయహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, జయహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు అక్కినపెల్లి సతీష్ కుమార్ మాట్లాడుతూ, అవసరంలో ఉన్న వారికి సేవ చేయడం లోనే నిజమైన ఆనందం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలకు ప్రతినెల విరాళాలు అందిస్తున్న విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాషా, రజిత, సుమలత, సరిత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



నేర రహిత సమాజ నిర్మాణానికి న్యాయ విజ్ఞానం అవసరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిహారిక



నాగర్ కర్నూల్ అక్టోబర్ 09 ప్రజా కలం (ప్రతినిధి): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బిజినపల్లి మండలంలోని వట్టెం గ్రామ పంచాయతీకార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండటం వల్ల సమాజంలో నేరాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని, తద్వారా నేర రహిత సమాజ నిర్మాణానికి న్యాయ విజ్ఞానం అవసరమని దీనికి అందరూ కృషి చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రజలు తమ హక్కులు, బాధ్యతలు, చట్టపరమైన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు... జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను ఈ సందర్భంగా నిహారిక వివరించారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని అర్హులైన వారికి సంస్థ తరఫున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. న్యాయపరమైన సలహాలు, సహాయం అవసరమైన వారు 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని పేర్కొన్నారు.సదస్సులో భాగంగా గ్రామ ప్రజలకు ఉన్న న్యాయపరమైన సందేహాలను నివృత్తి చేసి, వారికి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, గ్రామ సర్పంచ్ జ్యోతిశంకర్, పంచాయతీ కార్యదర్శి మహేష్ నాయక్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో పచ్చదనానికి ప్రతీకగా నిలిచిన వేపచెట్టు

రామకృష్ణ థియేటర్ సమీపంలో దశాబ్దాలుగా ప్రజలకు నీడనిస్తున్న మహావృక్షం



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 09 (ప్రజా కలం): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రామకృష్ణ థియేటర్ సమీపంలో ఉన్న భారీ వేపచెట్టు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పట్టణంలో వేగంగా నిర్మాణాలు పెరుగుతున్నప్పటికీ, ఎన్నో ఏళ్లుగా ఈ చెట్టు ప్రకృతి పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తూ ప్రజలకు చల్లని నీడను అందిస్తోంది. విశాలంగా విస్తరించిన కొమ్మలు, పచ్చని ఆకులతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్న ఈ వేపచెట్టు వద్ద స్థానికులు సేదతీరుతున్నారు. ప్రయాణికులు, వాహనదారులు సైతం కొద్దిసేపు ఆగి చెట్టు నీడను ఆస్వాదిస్తున్నారు. చెట్టు చుట్టూ ఏర్పాటు చేసిన ప్రదేశం కూడా ప్రజలు కూర్చునేందుకు అనువుగా ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పలువురు అక్కడ కనిపిస్తున్నారు. వేపచెట్టు ఔషధ గుణాలు కలిగినదిగా, పర్యావరణానికి ఎంతో మేలు చేసేదిగా ప్రజల్లో విశ్వాసం ఉంది. పట్టణాల్లో ఇలాంటి పెద్ద వృక్షాలను కాపాడుకోవడం ద్వారా పచ్చదనాన్ని పెంచడంతో పాటు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.అభివృద్ధి పేరుతో పాత వృక్షాలను తొలగించకుండా, వాటిని సంరక్షిస్తూ మరిన్ని మొక్కలు నాటాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. రామకృష్ణ థియేటర్ సమీపంలోని ఈ మహావృక్షాన్ని కూడా అధికారులు ప్రత్యేకంగా పరిరక్షించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో విద్యార్థులకు మెరుగైన వైద్య విద్యను అందించాలి:- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ,అక్టోబర్ 9(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పన, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినప్పుడే వారి సామర్థ్యాలు పెరుగుతాయని, అలాగే వారు మంచి వైద్యులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. వైద్య కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, వారి విద్యా సంబంధిత విషయాలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు నిర్దేశిత పరీక్షలను నిర్వహిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయా విభాగాల్లో అవసరమైన వైద్య సేవలను అందించేందుకు కావలసిన పరికరాలన్నీ ప్రాధాన్యత క్రమంలో సమకూర్చుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ రాజేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, డిసిహెచ్ఓ కాశీనాథ్, ఇతర అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజా కలం
శనివారం, అక్టోబర్ 10, 2026

మహిళలపై హింసకు అంతమెప్పుడు?

అర్ధరాత్రి కాదు.. పట్టపగలూ మహిళల భద్రతకు భరోసా కరవవుతోంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమార్తె క్షేమంగా తిరిగి వస్తుందో లేదోనన్న ఆందోళన తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఉద్యోగాలకు వెళ్లే మహిళల నుంచి విద్యాసంస్థల్లో చదువుకునే బాలికల వరకు వేధింపులు, లైంగిక దాడులు, బెదిరింపులు ఎదుర్కొంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మహిళలకు రక్షణగా నిలవాల్సిన కుటుంబాల్లోనూ హింస



చోటుచేసుకోవడం మరింత విచారకరం. స్త్రీ సాధికారత గురించి విస్తృతంగా చర్చిస్తున్న సమాజంలో ఆమె భద్రతే ప్రశ్నార్థకంగా మారడం ఆత్మపరిశీలనకు దారితీయాలి. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదిక ప్రకారం 2024లో దేశవ్యాప్తంగా మహిళలపై 4,41,534 నేరాలు నమోదయ్యాయి. అంటే రోజుకు సగటున 1,210 కేసులు.. ప్రతి 71 సెకన్లకు ఒక కేసు! 2023లో నమోదైన 4,48,211 కేసులతో పోలిస్తే 1.5 శాతం తగ్గుదల కనిపించినప్పటికీ సమస్య తీవ్రత ఏమాత్రం తక్కువ కాదు. లక్షమంది మహిళలకు నమోదైన నేరాల జాతీయ సగటు 64.6 కాగా, తెలంగాణలో 128.6గా ఉంది. రాష్ట్రంలో 2023లో 23,678 కేసులు నమోదు కాగా, 2024లో ఆ సంఖ్య 24,495కు పెరగడం గమనార్హం. మహిళలపై నేరాల్లో గృహహింస వాటా అత్యధికంగా ఉండటం కలవరపరుస్తోంది. 2024లో భర్త, అతని బంధువుల క్రూరత్వానికి సంబంధించి 1,20,227 కేసులు నమోదయ్యాయి. మొత్తం నేరాల్లో వీటి వాటా 27.2 శాతం. అపహరణలకు సంబంధించి 67,829 కేసులు, పోక్సో చట్టం పరిధిలో 67,809 కేసులు, అత్యాచారాలకు సంబంధించి 29,536 కేసులు నమోదయ్యాయి. అత్యాచార కేసుల్లో 96.8 శాతం మంది నిందితులు బాధితులకు పరిచయస్తులే కావడం విశ్వాస సంబంధాల్లోనూ పొంచి ఉన్న ప్రమాదాన్ని తెలియజేస్తోంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం 18 నుంచి 49 ఏళ్ల వివాహిత మహిళల్లో 29.3 శాతం మంది జీవితంలో ఏదో ఒక సమయంలో భర్త నుంచి హింసను ఎదుర్కొన్నారు. కుటుంబ పరువు, సామాజిక ఒత్తిళ్లు, ఆర్థిక పరాధీనత కారణంగా అనేకమంది బాధితులు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్నారు. నమోదైన కేసుల కంటే వాస్తవ సమస్య మరింత విస్తృతంగా ఉండే అవకాశముంది. మరోవైపు సాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగంతో మహిళలకు కొత్త ముప్పులు ఎదురవుతున్నాయి. మార్ఫింగ్ చిత్రాలు, డీప్‌ఫేక్ వీడియోలు, ఆన్‌లైన్ వేధింపులు, వ్యక్తిగత సమాచారంతో బెదిరింపులు పెను సవాళ్లుగా మారాయి. 2024లో దేశవ్యాప్తంగా మొత్తం సైబర్ నేరాలు 1,01,928 నమోదు కావడం డిజిటల్ భద్రత ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తోంది. మహిళల రక్షణకు అమలవుతున్న మిషన్ శక్తి వంటి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలి. దేశవ్యాప్తంగా 991 వన్‌స్టాప్ కేంద్రాల ద్వారా 2026 జూన్ చివరినాటికి 15.20 లక్షల మందికి పైగా మహిళలకు సహాయం అందింది. మహిళా సహాయవాణి 181, అత్యవసర సేవల నంబరు 112పై విస్తృత అవగాహన కల్పించాలి. ప్రతి పోలీసుస్టేషన్‌లో మహిళల ఫిర్యాదులకు తక్షణ స్పందన ఉండాలి. వేగవంతమైన దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, బాధితులకు న్యాయసహాయం, సత్వర విచారణకు ప్రాధాన్యమివ్వాలి. పని ప్రదేశాల్లో ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను పటిష్ఠం చేయాలి. పాఠశాల స్థాయి నుంచే బాలురలో మహిళల పట్ల గౌరవం, సమానత్వ భావన పెంపొందించాలి. కుటుంబాలు కూడా ఆడపిల్లలపై ఆంక్షలు విధించడం కంటే మగపిల్లలకు బాధ్యతాయుతమైన ప్రవర్తన నేర్పించాలి. మహిళలను నాలుగు గోడల మధ్య ఉంచడం భద్రత కాదు. వారు ఎక్కడైనా, ఎప్పుడైనా భయం లేకుండా జీవించగలిగే వాతావరణాన్ని కల్పించడమే నిజమైన రక్షణ. మహిళ స్వేచ్ఛగా అడుగువేయలేని సమాజం ఎంత అభివృద్ధి సాధించినా అది అసంపూర్ణమే!

- సి.హెచ్. ప్రతాప్

విద్యా భారతి పాఠశాలలో
అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

- డీజే పాటలతో అలరించిన విద్యార్థులు ఉపాధ్యాయులు మహిళలు

- బంజారా మహిళల నృత్యాలు ఆకర్షనీయంగా నిలిచాయి



నిర్మల్ అక్టోబర్ 09(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): కుబీర్ మండలంలోని పల్సి గ్రామంలోని విద్యా భారతి పాఠశాలలో బతుకమ్మ బతుకమ్మల పాటలతో విద్యార్థినిలు, ఉపాధ్యాయులు, మహిళలు డీజే పాటలతో ఓరెత్తిస్తూ నృత్యాలు చేస్తూ అంబరా నంటిన బతుకమ్మ సంబరాలు. తెలంగాణలో ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ పండుగ, తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలు గొప్పతనాన్ని తెలియజేస్తూ, ప్రకృతిలో సూర్యచంద్రులను కొలిచిన విధంగానే వివిధ రకాల పూలను కొలిచే పండుగ మన రాష్ట్రంలో కొనసాగుతోంది. తిరొక్క రంగుల పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను పెట్టి భక్తిశ్రద్ధలతో బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ప్రజల కష్టసుఖాలను పాట రూపంలో పాడుతూ బతుకమ్మను కొని ఆడతారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను పిలుచుకొని కుటుంబమంతా సంబరాలు చేసుకుంటు, బతుకమ్మ ఒక సామాజిక ఉత్సవం. మత, వర్గ, కుల, వృత్తి, ప్రాంత సంప్రదాయాలకు అతీతంగా జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ వారసత్వాన్ని ప్రపంచానికి చాటింది. అశ్వయుజ అమావాస్యనాడు ఎంగిలి పూల పేరుతొ ఎంగిలికాని పూలతొ పేర్చిన బతుకమ్మతో మొదలై... తొమ్మిది రోజులు కొనసాగి దుర్గాష్టమి నాడు సద్దుల బతుకమ్మతో పూర్తవుతుంది. ప్రకృతిలో లభించే అన్ని రకాల పూలతో బతుకమ్మను పేర్చి ఆడ మగ వయోభేదం లేకుండా ఈ పండుగలో పాలుపంచుకుంటారు.తెలంగాణలో బతుకమ్మ పండగకు ఉన్నంత ప్రాముఖ్యత మరే పండగకు ఉండదు. ఒక్కోరోజుకు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఒక్కోరోజు ఒక్కో బతుకమ్మను పేరుస్తూ.. ఊరూవాడా ఏకమై పండగ చేసుకుంటారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పురంశెట్టి లింగయ్య, ఉపాధ్యాయులు పోతన్న, మధుసూదన్, సాయినాథ్,కొట్టే ప్రవీణ్, రాజు, దేవేందర్, దేవకి, కవిత,సరోజన, రాణి, గంగామణి, సరస్వతి, నేహా, గంగ వేణి, శృతిక, పద్మ, లక్ష్మి, ఆయా గ్రామాల తల్లిదండ్రులు, మహిళలు పాల్గొన్నారు.

రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

- ఎమ్మెల్యే రామారావు పటేల్



తానూర్,అక్టోబర్ 9(ప్రజా కలం) మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్పష్టం చేశారు. మండలంలోని మొగ్లి, ఎల్వీ, ఝరి-బి, ఝరి-కె, ఝరి తండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో భూసమస్యలు, భూసేకరణ, రహదారులు, వంతెనలు, విద్యా రంగ సమస్యలపై ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. రైతుల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, రికార్డులను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

22-ఏ నిబంధన ఎత్తివేతకు కృషి... మొగ్లి గ్రామంలో పంజాబ్ ల్యాండ్స్ చట్టంలోని 22-ఏ నిబంధనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టాదారులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు, ఇటీవల నిర్మల్ కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో తానూర్ మండల పరిధిలోని సుమారు 2,500 ఎకరాల భూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు, రైతులు తమ భూముల పత్రాలను అధికారులకు అందజేయాలని సూచించారు, గ్రామ ప్రధాన రహదారి నిర్మాణంతో పాటు 'వికసిత్ భారత్ - గ్రామీణ్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్' కింద వ్యవసాయ బాటల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాళేశ్వరం భూసేకరణ రికార్డుల పరిశీలన...

ఎల్వీ గ్రామంలో 22 ఏళ్ల క్రితం 31 ఎకరాల లావాదేవీలు జరిగితే, అనంతరం 81 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చడంపై చర్చించారు. అలాగే కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు 28వ ప్యాకేజీ భూసేకరణలో వాస్తవ విస్తీర్ణానికి మించి నమోదు కావడంపై రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రెవెన్యూ, సాగునీటి శాఖ అధికారులతో మాట్లాడి రికార్డులను పునఃపరిశీలిస్తామని, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. రైతులు సంబంధిత ఆధారాలతో మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

340 ఎకరాల నిషేధిత భూముల సమస్యపై భరోసా...

ఝరి-బి, ఝరి-కె, ఝరి తండా గ్రామాల్లో మొత్తం 462 ఎకరాలకు గాను 124 ఎకరాలకే పట్టాలు ఉన్నాయని, మిగిలిన 340 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉండటం వల్ల రైతులు రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై అధికారులతో చర్చించి తగిన పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు.

మౌలిక సదుపాయాలు, విద్యారంగ అభివృద్ధి....

గ్రామాల్లో రహదారులు, వంతెనల నిర్మాణంతో పాటు ఉపాధ్యాయుల కొరతను తీర్చి విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా చూస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ గ్రామసభల్లో గ్రామ సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

రెవెన్యూ, అటవీ భూముల హద్దుల గుర్తింపునకు రీ సర్వే

ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్, అక్టోబర్ 9(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): జిల్లాలో రెవెన్యూ, అటవీ భూ సమస్యల పరిష్కారానికి భూముల రీ సర్వే ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భూముల రీ సర్వే, అటవీ-రెవెన్యూ భూ సమస్యలు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రీ సర్వే ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ, నీటిపారుదల తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి, భూ సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఈ ప్రక్రియను పార దర్శకంగా, వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, జిల్లా అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీవో దేవిదాస్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు సరిత తిరుపతయ్యకు ఆహ్వానం

మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించిన స్వకుళసాళి మహిళా మండలి సభ్యులు



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 9 (ప్రజా కలం): దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్యను స్వకుళసాళి మహిళా మండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. గద్వాల జిల్లా కేంద్రంలోని సరిత తిరుపతయ్య స్వగృహంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని వేదనగర్ కాలనీలో ఉన్న శ్రీ శివాలయ పాండురంగ మందిరంలో దేవీ నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలకు హాజరుకావాలని మహిళా మండలి సభ్యులు ఆమెను ఆహ్వానించారు.

మహిళా మండలి సభ్యుల ఆహ్వానానికి సరిత తిరుపతయ్య సానుకూలంగా స్పందించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వకుళసాళి మహిళా మండలి సభ్యులు గాయత్రి, అర్చన, నిర్మల, రేఖ, నందిని, యువజన సంఘం సభ్యులు కాంళ్లే శ్రీను, సాక్రే శ్రీనివాస్, రాజు, కృష్ణయ్య గౌడ్, కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దసరాకు కొండారెడ్డిపల్లికి సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమీక్ష

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి..

ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు



నాగర్‌కర్నూల్ అక్టోబర్ 09 (ప్రజాకలం): దసరా పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొండారెడ్డిపల్లి గ్రామానికి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం మండలం కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకుఅన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలి...ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సంబంధిత శాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పర్యటనకు సంబంధించి శాఖల వారీగా చేపట్టాల్సిన పనులను సమీక్షిస్తూ, అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గ్రామంలో అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు సమన్వయంతో చేపట్టాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పర్యటనకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే ముందుగానే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నపాడులో ఘనంగా బతుకమ్మ సంబరాలు!

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సర్పంచ్ భూపాణి సవరన్న



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 9 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం చిన్నపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో సర్పంచ్ సందడి!

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ భూపాణి సవరన్న హాజరై విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, గ్రామ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన.. విద్యార్థులతో కలిసి భోజనం!

అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ భూపాణి సవరన్న పరిశీలించారు. భోజనం నాణ్యతను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిన్న సవరణ, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు గద్వాల గురుకుల విద్యార్థిని అర్షియా ఎంపిక!

విద్యార్థినిని అభినందించిన ప్రిన్సిపల్ భవాని, వ్యాయామ ఉపాధ్యాయురాలు రాధ



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 9 (ప్రజా కలం):జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని అర్షియా ఎంపికైంది. ఈ నెల 4న హైదరాబాద్‌లోని ఘట్కేసర్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి 34వ సబ్‌జూనియర్ త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ నెల 30 నుంచి నవంబర్ 1 వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో జరగనున్న 34వ సబ్‌జూనియర్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో అర్షియా తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొననుంది.జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అర్షియాను పాఠశాల ప్రిన్సిపల్ భవాని, వ్యాయామ ఉపాధ్యాయురాలు రాధ, అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్షియా జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.

పిల్లలమర్రిని ఆధునిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా - రూ.2.5 కోట్లతో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనుల పరిశీలన..

సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 09:

మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన పిల్లలమర్రిని అన్ని ఆధునిక సౌకర్యాలతో ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ పిల్లలమర్రిని సందర్శించి పర్యాటక, అటవీ, మత్స్య, విద్య, పురావస్తు శాఖల ఆధ్వర్యంలో రూ. 2.5 కోట్ల తో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు చేశారు పర్యటనలో భాగంగా ముందుగా పర్యాటక ప్రాంతంలోని ప్రవేశ ద్వారం, టికెట్ కౌంటర్, మరుగుదొడ్లు, ప్రహరీ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, పర్యాటక ప్రాంతం ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సైన్స్ మ్యూజియాన్ని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియం తరహాలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. చిల్డ్రన్స్ పార్కును కూడా ఆకర్షణీయంగా, రంగురంగుల ఆట పరికరాలతో ఆధునికీకరించాలని ఆదేశించారు. పాతబడిన ఆట పరికరాలను తొలగించి, కొత్త పరికరాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన బడ్జెట్ అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పురావస్తు శాఖ ఆధ్వర్యంలోని ప్రదర్శనశాలను సందర్శించిన కలెక్టర్, ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు చారిత్రక ప్రాధాన్యత కలిగిన వస్తువులు, విగ్రహాలను పరిశీలించారు. వాటి చారిత్రక నేపథ్యం, ప్రాధాన్యత తెలిసేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పాత భవనాల స్థితిగతులను పరిశీలించి, పై కప్పు పెచ్చులు ఊడుతున్న వాటిని గమనించిన కలెక్టర్ వాటిని మరమ్మతులు లేదా పునరుద్ధరణ చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. సైన్స్ మ్యూజియం పరిసరాల్లో చెత్తాచెదారం గడ్డి లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిల్లలమర్రి ప్రసిద్ధ మర్రిచెట్టు పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రాంగణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పచ్చదనం పెంపొందించేలా ల్యాండ్‌స్కేపింగ్ చేపట్టాలని సూచించారు. సందర్శకులకు తాగునీరు, చెత్తబుట్టలు వంటి సదుపాయాలు కల్పించాలని, గడ్డి, మొక్కలు పచ్చగా ఉండేలా క్రమం తప్పకుండా నీటిని అందించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. కేఫ్‌టేరియా ప్రాంతంలోనూ సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జింకల పార్కును సందర్శించిన కలెక్టర్ అక్కడ ఉన్న జింకల సంఖ్య, వాటికి అందిస్తున్న ఆహారం, తాగునీరు, సంరక్షణ చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 85 జింకలు ఉన్నట్లు అధికారులు వివరించారు. జింకల సంరక్షణ, వాటి ప్రాధాన్యతపై అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలోని ఆక్వేరియాన్ని పరిశీలించిన కలెక్టర్, సుమారు 27 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాన్ని ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల సమన్వయంతో సమగ్ర అభివృద్ధి పను చేపట్టాలని, ఆధునిక ఆక్వేరియంలు, 3డీ గ్రాఫిక్స్, ఆకర్షణీయమైన పెయింటింగ్స్‌తో పాటు సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదర్శనలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధుల కోసం మత్స్యశాఖ కమిషనర్ ద్వారా ప్రతిపాదనలు సమర్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆక్వేరియం, జంతు ప్రదర్శన ప్రాంతాల్లో వివిధ రకాల జలచరాలు, పాములు, ఇతర జీవుల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించేలా సమాచార సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాటి జీవన విధానం, ప్రత్యేకతలు, పర్యావరణంలో వాటి పాత్రను వివరించే సమాచారాన్ని స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.పిల్లలమర్రిలోని అన్ని పర్యాటక ఆకర్షణలను సమగ్రంగా అభివృద్ధి చేసి, సందర్శకులకు మెరుగైన అనుభూతి కలిగించేలా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అవసరమైన పనులకు సంబంధించి అంచనాలు, బడ్జెట్ ప్రతిపాదనలు, కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డి.ఆర్.ఓ ఎ. నిర్మల, డి.ఎఫ్.ఓ ఎం.నవీన్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.రాజశేఖర్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి రాధా రోహిణి, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి, విద్యాశాఖ నుండి ఎ.ఎం.ఓ డి.శ్రీనివాస్, అటవీశాఖ అధికారులు, పర్యాటక శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గద్వాలలో డ్రై ఫ్రూట్స్ కలకలం!

- పురుగులున్నాయంటూ వినియోగదారుడి ఆరోపణలు.. తనిఖీలకు డిమాండ్



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 9 (ప్రజా కలం):

గద్వాల పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఉన్న డ్రై ఫ్రూట్ హౌస్ దుకాణంలో కొనుగోలు చేసిన డ్రై ఫ్రూట్స్‌లో పురుగులు ఉన్నాయని కేటీ దొడ్డి మండలం కొండాపురం గ్రామానికి చెందిన పవన్ కుమార్ ఆరోపించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించాలని ఆయన కోరారు.

కొనుగోలు చేసిన డ్రై ఫ్రూట్స్‌లో పురుగులు!

పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పది రోజుల క్రితం సదరు దుకాణంలో డ్రై ఫ్రూట్స్ కొనుగోలు చేశారు. వాటిని ఇంటికి తీసుకెళ్లి పరిశీలించగా పురుగులు ఉన్నట్లు గుర్తించానని తెలిపారు. ఈ విషయమై దుకాణ యజమానిని ప్రశ్నించగా, కొనుగోలు చేసిన వస్తువులను తిరిగి తీసుకునేది లేదని, ఎక్కడైనా ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పినట్లు పవన్ కుమార్ ఆరోపించారు.

ఆహార భద్రతా అధికారులు స్పందించాలి

ఆహార పదార్థాల నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పవన్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత ఆహార భద్రతా అధికారులు సదరు దుకాణంలో తనిఖీలు నిర్వహించి, విక్రయిస్తున్న డ్రై ఫ్రూట్స్ నాణ్యతను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

బహుజన రాజ్యాధికారమే కాన్షీరాంకు నిజమైన నివాళి!

- సామాజిక తెలంగాణ నిర్మాణానికి కాన్షీరాం ఆలోచనలే పునాది

- ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేష్ మహారాజ్



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 9 (ప్రజా కలం):

మాన్యశ్రీ కాన్షీరాం ఆశయాలను సాధించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేష్ మహారాజ్ అన్నారు. కాన్షీరాం 20వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు నాగరాజ్, కిషోర్, వేమన్న తదితరులు పాల్గొన్నారు.

బహుజనులకు రాజకీయ అధికారంలో సముచిత వాటా కల్పించాలి

భారతదేశంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న కులాధిపత్యానికి వ్యతిరేకంగా అణగారిన వర్గాలను సంఘటితం చేసి, వారి జనాభా బలాన్ని రాజకీయ శక్తిగా మార్చేందుకు కాన్షీరాం విశేష కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాజకీయ అధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించాలనే ఆయన ఆలోచనలు నేటికీ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని తెలిపారు. కాన్షీరాం రాజకీయ ప్రయాణం సామాజిక చైతన్యం, సంఘటితం, రాజకీయ అధికారం అనే మూడు ప్రధాన దశలకు ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న అణగారిన వర్గాల విద్యావంతులను సామాజిక మార్పులో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో బామ్‌సేఫ్‌ను నిర్మించారని, అనంతరం డీఎస్-4 ద్వారా ప్రజలను సంఘటితం చేసి, 1984లో బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించారని గుర్తుచేశారు.

అణగారిన వర్గాలకు రాజకీయ చైతన్యం కల్పించిన మహనీయుడు

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో సామాజిక సమానత్వం, స్వాభిమానం, రాజకీయ సాధికారత కోసం కాన్షీరాం తన జీవితాన్ని అంకితం చేశారని నాయకులు కొనియాడారు. అణగారిన వర్గాలు కేవలం ఓటర్లుగా మిగిలిపోకుండా, స్వయంగా రాజకీయ నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ ఎదుగుదల, మాయావతి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం, 2007లో ఆ పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించడం బహుజన రాజకీయ చరిత్రలో కీలక ఘట్టాలని తెలిపారు. రాజకీయ చైతన్యంతో పాటు బలమైన సంస్థాగత నిర్మాణం, క్రమశిక్షణతో కూడిన నాయకత్వం, ఐక్యత ఉంటేనే సామాజిక మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.


సామాజిక తెలంగాణ నిర్మాణమే లక్ష్యం కావాలి

కాన్షీరాం 20వ వర్ధంతి సందర్భంగా తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాజకీయ నిర్ణయాధికారంలో తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. బహుజన వర్గాలు ఐక్యంగా సంఘటితమై తమ హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాన్షీరాం ఆశయాలను ఆచరణలో పెట్టడం, సామాజిక న్యాయం సాధించడం, బహుజనులకు సముచిత రాజకీయ భాగస్వామ్యం కల్పించడం ద్వారానే సమానత్వంతో కూడిన సామాజిక తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని నాయకులు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో పేదలకు అన్యాయం.. ప్రజా ప్రభుత్వంలోనే సంక్షేమం

- పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం.. మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

- డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 09:

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయకుండా నాటి ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లి యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి విమర్శించారు. ముఖ్యమంత్రి లిశ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎన్నికల హామీలను అమలు చేస్తోందని తెలిపారు. హన్వాడ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అర్హులైన లబ్ధిదారులకు నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు కనీస అవసరమైన రేషన్ కార్డులను సైతం అందించలేని స్థితిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా నాణ్యమైన సన్నబియ్యాన్ని రేషన్ షాపుల్లో అందిస్తోందని పేర్కొన్నారు. రైతుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం ఏకకాలంలో రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసిందని, సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ అందిస్తోందని వివరించారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, వారికి ఉచిత బస్సు ప్రయాణమే కాదు ఆ బసులకే ఓనర్లను చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదని మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యమిస్తూ మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేస్తూ వారి ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టరేట్లతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తూ వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నామని వివరించారు. పేదలు, మహిళలు, రైతులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్ , కార్యనిర్వహక అధ్యక్షులు చెన్నయ్య, హన్వాడ గ్రామ సర్పంచ్ ఇస్నాతి సుధాకర్, నాయకులు టంకర కృష్ణయ్య యాదవ్, జె.వెంకటయ్య , యాదిరెడ్డి, వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు మరియు ఎస్సి సెల్, బిసి సెల్, మైనారిటీ సెల్ యువజన విభాగం వివిధ గ్రామాల సర్పంచులు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మండల రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గద్వాలలో ఘనంగా కిసాన్ మేళా!

ఆధునిక సాంకేతికతతో సాగు.. ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, సరిత



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 9 (ప్రజా కలం):

రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. శుక్రవారం గద్వాలలోని కేఎస్ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళాలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించి, వ్యవసాయ యంత్రాలు, నూతన సాగు పద్ధతులను పరిశీలించారు. అనంతరం రైతులు, శాస్త్రవేత్తలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులు డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం వంటి వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం కావాలి

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని పేర్కొన్నారు. రైతులు బాగుంటేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

వ్యవసాయ అనుబంధ రంగాలతో అదనపు ఆదాయం

రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ రైతులు పంటల సాగుతో పాటు పాడి పరిశ్రమ, పశుపోషణ వంటి అనుబంధ రంగాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప, ఆత్మ డిప్యూటీ పీడీ జగ్గు నాయక్, గద్వాల పీఏసీఎస్ చైర్మన్ సుభాన్, మల్దకల్ సింగిల్ విండో చైర్మన్ ఎస్. తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

పీర్ల ముజావర్ షేక్ యూసుఫ్ ఆధ్వర్యంలో..

తల్లాడలో ఘనంగా గ్యార్మీ వేడుకలు

సంప్రదాయబద్ధంగా వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగిన ర్యాలీ - మత సామరస్యం,ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా గ్యార్మీ పండుగ





తల్లాడ ఆగస్టు 9 ప్రజా కలం న్యూస్ : తల్లాడ పట్టణంలో గ్యార్మీ వేడుకలు ఘనంగా, సంప్రదాయబద్ధంగా జరిగాయి.పీర్ల ముజావర్ షేక్ యూసుఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. తరతరాలుగా వస్తున్న మతపరమైన ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మత పెద్దలు,కమిటీ సభ్యులు,స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. గ్యార్మీ పండుగలో భాగంగా నిర్వహించిన ర్యాలీ సంప్రదాయబద్ధంగా కొనసాగింది.పీర్ల ముజావర్ షేక్ యూసుఫ్ నేతృత్వంలో మరో ముఖ్య మత పెద్ద మాలీ సాబ్‌తో పాటు కమిటీ సభ్యులు షేక్ బడేమియా,షేక్ నన్నే సాబ్,షేక్ నాగులా సహకారంతో వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం.గ్యార్మీ పండుగ మతపరమైన విశ్వాసాలకు, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఇలాంటి వేడుకలు సమాజంలో పరస్పర గౌరవం,ఐక్యత, సోదరభావం పెంపొందించడానికి దోహదపడతాయి. పండుగ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో మత పెద్దలు,నిర్వాహకుల పాత్ర కీలకమని ఈ వేడుకలు చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో షేక్ యాసిన్ పాషా (దాదా),మదారి జానీ, పటాన్ జానీ,షేక్ నాగుల్,మీరా,సోందు, రఫీ,అక్బర్, మహిళలు చిన్నారులు ఉత్సాహంగా ర్యాలీలో తదితర ప్రముఖులు పాల్గొన్నారు. స్థానికుల సహకారం, మత పెద్దల సమన్వయంతో గ్యార్మీ వేడుకలు ఘనంగా కొనసాగాయి.

రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

- ఎండిపోతున్న వరి పంటలకు నష్టపరిహారం అందించాలిలి

- తిమ్మాపురం సబ్‌స్టేషన్ వద్ద బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా

- బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టం మోహన్



అక్టోబర్ 9 హన్మకొండ: -(ప్రజాకలం ప్రతినిధి) రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా ఎండిపోతున్న వరి పంటలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం జాతీయ రహదారిపై ఉన్న తిమ్మాపురం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించినట్టు కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టం మోహన్ తెలిపారు. రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమం లో ఆయన విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో వరి పంటలు ఎండిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు బీజేపీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

శ్రీ అరబిందో పాఠశాలలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు

- విద్యార్థులతో కలిసి నృత్యం చేసిన ప్రిన్సిపాల్

- ఉత్సాహంగా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు

అక్టోబర్ 09, ప్రజాకలం ప్రతినిధి (వరంగల్ / వర్ధన్నపేట)

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని శ్రీ అరబిందో పాఠశాలలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డీజే పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు సందడి చేశాయి. ముఖ్యంగా పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ సింగ్ విద్యార్థులతో కలిసి స్నేహపూర్వకంగా నృత్యం చేయడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉత్సాహపరుస్తూ, పండుగల ప్రాధాన్యతను తెలియజేశారు. సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్ సింగ్, దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ సి ఉద్యోగి కి నివాళులు అర్పించిన ఎంఈఓ

- తక్షణ సహాయం కింద పన్నెండు వేలు ఆర్థిక సహాయం అందజేత

(వరంగల్/పర్వతగిరి) అక్టోబర్ 09, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండల విద్యా వనరుల కేంద్రంలో అటెండర్ గా విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి చందా సారయ్య పార్థివదేహాన్ని మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి, ఎమ్మార్సీ సిబ్బంది సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తక్షిణ సహాయం కింద సహ ఉద్యోగులు పోగు చేసిన 12 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి మాట్లాడుతూ, సారయ్య అకాల మరణం బాధాకరమని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆశీస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి విద్యాశాఖ తరఫున అందవలసిన సహాయం త్వరగా అందేలా చూస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల విద్యా వనరుల కేంద్ర సిబ్బంది శిల్పా, జయరాజ్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ప్రవీణ్, శ్రీనివాస్, రజిత, సుధా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ పోటీలకు ఏకశిల విద్యార్థిని జెస్సీ

విజేతగా తిరిగి రావాలని చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి ఆకాంక్ష

అక్టోబర్ 10 ఐనవోలు:- (ప్రజా కలం ప్రతినిధి)

న్యూఢిల్లీలో నిర్వహించనున్న 12వ జాతీయస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ మానక్ పోటీలకు ఏకశిల విద్యాసంస్థల విద్యార్థిని కె. జెస్సీ ఎంపికైంది. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి విద్యార్థినిని అభినందించి, జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక, క్రీడా రంగాల్లోనూ రాణించేలా విద్యాసంస్థల తరఫున ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత అవసరాలతోపాటు భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను ఎప్పటికప్పుడు తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కె. జెస్సీ తన ప్రతిభతో విజేతగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.అనంతరం ఇటీవల తమిళనాడులో నిర్వహించిన జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న ఏకశిల విద్యాసంస్థలకు చెందిన 24 మంది విద్యార్థులను చైర్మన్ అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎం.డి. బాబా, వైస్ ప్రిన్సిపల్ కె. శ్రీనివాస్, గైడ్ టీచర్ గుర్రం రమేష్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎయిడ్స్ నివారణలో వరంగల్‌కు జాతీయస్థాయి గుర్తింపు!

- హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల అమలులో మెరుగైన పనితీరు..

- ఆరు నెలలపాటు ఇదే స్థానం నిలబెట్టుకోవాలి

- 'సురక్షిత్ ప్లస్' సాధనే లక్ష్యం : డీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి

అక్టోబర్ 9 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్)

హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణ కార్యక్రమాల అమలులో వరంగల్ జిల్లా జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) ఇటీవల విడుదల చేసిన ర్యాంకుల్లో జిల్లా మెరుగైన పనితీరుతో సురక్షిత్ హోదాను సాధించినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజారెడ్డి తెలిపారు.జిల్లా కలెక్టర్ సత్యశారద మార్గదర్శకత్వంలో, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐసీటీసీ కేంద్రాలు, ఏఆర్‌టీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో చేపడుతున్న కార్యక్రమాలు ఈ గుర్తింపునకు దోహదపడ్డాయని వివరించారు. ప్రస్తుతం సాధించిన సురక్షిత్ హోదాను రానున్న ఆరు నెలలపాటు కొనసాగించి, సురక్షిత్ ప్లస్ స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్, యాంటీ రెట్రోవైరల్ (ఏఆర్‌టీ) మందులు, సీడీ4, వైరల్ లోడ్ పరీక్షలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

హెచ్ఐవీని ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం, చికిత్స నిరంతరాయంగా కొనసాగించడం, వైరల్ సప్రెషన్ సాధించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.



వివక్షకు తావివ్వొద్దు

హెచ్ఐవీపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడంతోపాటు, వ్యాధి బారినపడిన వారిపై వివక్ష చూపకుండా అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని డీఎంహెచ్ఓ సూచించారు. ప్రజలు అపోహలను వీడి, అవసరమైనప్పుడు సమీప ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే వైద్యుల సూచనల మేరకు సకాలంలో చికిత్స పొందాలని కోరారు. హెచ్ఐవీ నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీవో డాక్టర్ అరుణ్‌కుమార్ జోషి, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ స్వప్న మాధూరి, ఐసీటీసీ సూపర్‌వైజర్ రామకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ కమలాకర్, ఐసీటీసీ కౌన్సెలర్లు, సహయోగి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.గమనిక: ప్రచురణకు ముందు డీఎంహెచ్ఓ పేరు, అలాగే నాకో ర్యాంకుల్లో పేర్కొన్న 'సురక్షిత్', 'సురక్షిత్ ప్లస్' హోదాల అధికారిక పేర్లను ఒకసారి నిర్ధారించుకోవడం మంచిది.

నాలుగు రోజుల మౌనపోరాటానికి ఫలితం!ప్రేమ వివాహం

- దళిత మహిళకు అండగా నిలిచిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు.

- ప్రేమజంటను ఒక్కటి చేయడంలో చొరవ.. మానవత్వానికి పెద్దపీట.

- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్.

అక్టోబర్ 09, ప్రజాకలం ప్రతినిధి (వరంగల్ / వర్ధన్నపేట)

నాలుగు రోజుల నిరాహార దీక్ష.. మౌనపోరాటం.. న్యాయం కోసం ఎదురుచూపులు.. చివరకు స్పందించిన ప్రజాప్రతినిధి చొరవతో సమస్యకు పరిష్కార మార్గం! వర్ధన్నపేట పట్టణంలో ఓ దళిత మహిళ తనకు న్యాయం చేయాలంటూ సాగించిన పోరాటం స్థానికంగా చర్చనీయాంశమైంది. బాధిత మహిళ ఆవేదనను గుర్తించి, సమస్య పరిష్కారానికి చొరవ చూపిన నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజును పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్ అభినందించారు.

రాజకీయాలకు అతీతంగా మానవత్వం!

ఒక మహిళ న్యాయం కోసం రోజుల తరబడి పోరాటం చేయాల్సిన పరిస్థితి రావడం సమాజం ఆత్మవిశీలన చేసుకోవాల్సిన అంశమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో బాధితురాలి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు చొరవ తీసుకోవడం అభినందనీయమని కొండేటి మహేందర్ పేర్కొన్నారు. సమాజంలో ఆడబిడ్డకు అన్యాయం జరగకూడదనే సంకల్పంతో ముందుకు వచ్చి, ఇరువర్గాలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయడం ఆయన మానవీయ దృక్పథానికి నిదర్శనమని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ కుమారుడితో ముడిపడిన ఈ వ్యవహారంలో బాధిత మహిళకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే చొరవ తీసుకోవడం, ప్రేమజంట వివాహానికి మార్గం సుగమం కావడం సంతోషకరమని మహేందర్ పేర్కొన్నారు. రాజకీయ హోదా, వ్యక్తిగత సంబంధాలకు అతీతంగా బాధితురాలి ఆవేదనను అర్థం చేసుకుని స్పందించడం ప్రజాప్రతినిధుల్లో ఉండాల్సిన బాధ్యతను గుర్తు చేస్తోందన్నారు.

ప్రజాసంఘాల పోరాటం.. బాధితురాలికి అండ

బాధిత మహిళ నాలుగు రోజుల పాటు నిరాహార దీక్ష, మౌనపోరాటం చేయడం ఆమె ఎదుర్కొన్న పరిస్థితిని తెలియజేస్తోంది. ఒక మహిళ తనకు న్యాయం కావాలంటూ రోడ్డెక్కాల్సి వచ్చినప్పుడు సమాజం, ప్రజాప్రతినిధులు, సంబంధిత వర్గాలు మౌనంగా ఉండకూడదనే విషయాన్ని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. బాధితురాలికి అండగా నిలిచిన ప్రజాసంఘాలు, దళిత మహిళా సంఘాలు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధుల స్పందనను మహేందర్ అభినందించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను వినడం, బాధితులకు భరోసా కల్పించడం, వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు కృషి చేయడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. బాధిత మహిళ ఆత్మగౌరవంతో సమాజంలో జీవించేలా న్యాయం జరగడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.

పార్టీ పటిష్టతతోపాటు ప్రజా సంక్షేమమే లక్ష్యం

పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, మానవత్వానికి విలువనిచ్చే నాయకత్వం అవసరమని కొండేటి మహేందర్ అన్నారు. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు స్పందించిన తీరు సమాజసేవ పట్ల ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తోందని ప్రశంసించారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి ఇలాంటి చొరవలు మరింత అవసరమని అభిప్రాయపడ్డారు.బాధిత మహిళకు న్యాయం జరిగేలా సహకరించిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజుకు, ఆమెకు మద్దతుగా నిలిచిన ప్రజాసంఘాలకు మహేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళల గౌరవం, హక్కులు, భద్రత విషయంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.న్యాయం కోసం ఒక మహిళ నాలుగు రోజుల పాటు పోరాడాల్సిన పరిస్థితి రాకూడదు. బాధితుల గొంతుకను పాలకులు ముందుగానే వినాలి. ప్రజల కన్నీటిని తుడిచే నాయకత్వమే ప్రజల హృదయాల్లో నిలిచిపోతుంది.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత..



-ప్రధానోపాధ్యాయుడు సంపత్ కుమార్

వెల్గటూర్, అక్టోబర్ 9, ప్రజాకలం, ప్రతినిధి :

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మండలంలోని పాసిగామ గ్రామంలో గల మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం గ్రీన్ బ్యాడ్జీలు ధరించి, పర్యావరణ పరిరక్షనే లక్ష్యంగా పర్యావరణ హిత బతుకమ్మ వేడుకలను విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి పాఠశాల ఆవరణలో నిర్వహించారు.ఈ సందర్భంగా నీలం సంపత్ కుమార్ మాట్లాడుతూ కెమికల్, ప్లాస్టిక్ వంటి వాటిని ఉపయోగించకుండా ప్రకృతి ప్రసాదించిన పువ్వులను ఉపయోగించిబతుకమ్మలను అందంగా తయారు చేసుకోవాలనిసూచించారు. చిన్నారుల్లో పర్యావరణ స్పృహ పెంపొందిస్తే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు విద్యార్థుల్లో పర్యావరణ ప్రేమను పెంపొందించడంతో పాటు, ప్రకృతిని గౌరవించడం, సహజ వనరులను సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి మంచి అలవాట్లను చిన్నప్పటి నుంచే అలవరచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంద్రపు శిరీష, ఉపాధ్యాయులు మహేష్, ప్రణీత, కావేరి, సహాయక బృందం రామక్క,ప్రవళిక, ఏఎన్ఎం అనురాధ, ఆశా కార్యకర్త జ్యోతి, అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి, సిఏ ప్రమీల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జెడ్పిహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 9, ప్రజాకలం ప్రతినిధి:

మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలతో అలరిస్తూ నృత్యం చేశారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ పేద ప్రజల బతుకులను సంతోషాలు నింపాలని. ఈ పండుగ మన రాష్ట్ర సాంప్రదాయానికి, సంస్కృతికి చిహ్నమని తెలిపారు. పదవ తరగతి అమ్మాయిలు ప్రథమ బహుమతి, 9వ తరగతి విద్యార్థులు పేర్చిన బతుకమ్మలు ద్వితీయ బహుమతి పొందాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, ప్రతిభ, శాంతి కిరణ్, పరుశురాములు, అశోక్ కుమార్, ఏ. మనోహర్, డాక్టర్ ఎం. భాస్కర్, డి. రవి కుమార్, రాధాకృష్ణకుమారి, రేఖ, ఎల్. రజిత, బైరి తిరుపతి, ఎస్. వెంకన్న , ఎ. తిరుమల, రమేష్ బాబు, ఎం. శ్వేత మొదలగు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు

- జాతీయ ఆహారభద్రత మిషన్ కోఆర్డినేటర్ సారంగం

(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 9, ప్రజాకలం ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ పర్వతగిరి ఆధ్వర్యంలో శుక్రవారం గడ్డపార తండ గ్రామపంచాయతీ పర్వతగిరి మండలం లో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా రైతులకి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ ఆహార భద్రత మిషన్ కోఆర్డినేటర్ సారంగం మాట్లాడుతూ, ప్రస్తుతం వరి పంట లో దోమపోటు, పత్తి పంటలో రసం పీల్చే పురుగులు, బెట్ట వరిస్థితులలో తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలను రైతులకు వివరించారు. రసాయనిక ఎరువులను, పురుగు మందులను మోతాదుకు మించి వాడడం వలన జరిగే నష్టాలను గురించి రైతులకు వివరించారు. రాబోయే యాసంగి లో వరికి బదులు తక్కువ నీరుతో పండించగల ప్రత్యామ్నాయ పంటలు అయినా అపరాలు, పల్లికాయ సాగు చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి పట్టా భూమి ఉన్న ప్రతి ఒక్క రైతు రిజిస్ట్రేషన్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గడ్డపార తండ సర్పంచ్ భూక్యా మంజుల శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు



రుద్రంగి, అక్టోబర్ 09, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మను పేర్చి, ఈ పూల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు రంగురంగుల దుస్తులు ధరించి, బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ సందడి చేశారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపధ్యాయులు సమ్మిరెడ్డి, మండల విద్యాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కేరళ హైస్కూల్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

మల్లాపూర్, అక్టోబర్ 09 (ప్రజా కలం ప్రతినిధి):

మల్లాపూర్ మండలం కొత్త ధారాజ్‌పల్లి గ్రామంలోని కేరళ హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ ఉత్సాహంతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆటపాటలతో అలరించారు. బతుకమ్మ పాటలు పాడుతూ పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సీబీ అనిల్ సింగ్,ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న 3వ వార్డు కౌన్సిలర్ సొజన్య విజయ్ కుమార్

- దుర్గామాత కమిటీకి లక్ష రూపాయల విరాళం



బెల్లంపల్లి, అక్టోబర్ 9, (ప్రజాకలం) ప్రతినిధి మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి పట్టణంలోని 3వ వార్డ్ రవీంద్రనగర్ లోని దుర్గామాతను గత నవరాత్రుల్లో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నామని,అమ్మవారు తన చల్లని చూపుతో దీవించి తనను 3వ వార్డ్ కౌన్సిలర్ గా అత్యంత భారీ మెజారిటీతో గెలిపించారని కౌన్సిలర్ బెడ్డల సొజన్య విజయ్ కుమార్ తెలిపారు.తన మొక్కు నెరవేరినందుకు ఈ సంవత్సరం నవరాత్రులు గాను రవీంద్రనగర్ దుర్గామాత కమిటీ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులకు శుక్రవారం ఒక్క లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ రవీంద్రనగర్ లోని దుర్గామాత అమ్మవారు చాలా మహిమగల దేవతని,కోరిన కోరికలను వెంటనే తీరుస్తుందన్నారు.అమ్మవారి కృపా కటాక్షం, రవీంద్రనగర్ ప్రజల దీవెనలతోనే తను భారీ మెజారిటీతో గెలిచారన్నారు.అమ్మవారి చల్లని దీవెనలు 3వ వార్డ్ రవీంద్రనగర్ ప్రజలందరిపై, మా కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో ప్రజలు ఉండాలని అమ్మవారినీ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత కమిటీ సభ్యులు, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

పీడీఎస్ సన్న బియ్యం అక్రమ తరలింపు

- 19.60 క్వింటాళ్ల బియ్యం సీజ్



ధర్మారం, అక్టోబర్ 09 : (ప్రజాకలం ప్రతినిధి) మండలంలోని మేడారం గ్రామంలోని లక్ష్మీ నరసింహ రైస్ మిల్ వద్ద ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ పిడిఎస్ ద్వారా సరఫరా చేసిన సన్న బియ్యాన్ని అక్రమంగా తరలించి రైస్ మిల్‌లో దించుతున్నారనే పక్కా సమాచారం ధర్మారం పోలీసులకు అందింది. ఈ సమాచారం మేరకు ధర్మారం ఎస్ఐ ఎంబడి శ్రీకాంత్ సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించి, సంబంధిత అధికారులు రైస్ మిల్ వద్దకు చేరుకుని పంచనామా నిర్వ హించాలని రిక్విజిషన్ జారీ చేశారు. సివిల్ సప్లై అధికారులు నిర్వహించిన తనిఖీల లో మొటం సారయ్య తన బొలెరో వాహనం లో ప్రభుత్వం సరఫరా చేసిన సన్న బియ్యాన్ని మొటం గురువయ్య సహకారం తో తీసుకువచ్చి లక్ష్మీ నరసింహ రైస్ మిల్ లో దించుతున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో మొత్తం 19.60 క్వింటాళ్ల పీడీఎస్ సన్న బియ్యం గుర్తించబడగా, సివిల్ సప్లై అధికారులు దానిని సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి మొటం సారయ్య, మొటం గురువయ్య, రైస్ మిల్ యజమాని రాజశేఖర్ పై సంబంధిత చట్టపరమైన నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టడం జరిగింది. ప్రభుత్వం పేద ప్రజలకు అందించేందుకు సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం లేదా ఇతర అవసరాలకు వినియో గించడం చట్టవిరుద్ధమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్ హెచ్చరించారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

– జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి శ్రీనిజ కోహిర్కర్



పెద్దపల్లి,అక్టోబర్ 09:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

దివ్యాంగులు,మానసిక వికలాంగుల హక్కుల పరిరక్షణకు,వారి సంక్షేమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పెద్దపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి శ్రీనిజ కోహిర్కర్ పేర్కొన్నారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల ఆదేశాల మేరకు,పెద్దపల్లిలోని స్ఫూర్తి మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంతో పాటు సుల్తానాబాద్‌లోని క్యాడర్ దివ్యాంగుల పాఠశాలలో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బందితో ఆమె ముఖాముఖి మాట్లాడి వారి సాధకబాధకాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జడ్జి శ్రీనిజ కోహిర్కర్ మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో ఎవరికీ తీసిపోరని,ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని భరోసా ఇచ్చారు.దివ్యాంగుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు, చట్టబద్ధమైన హక్కుల గురించి ఆమె వివరించారు.విద్యార్థులకు గానీ, వారి కుటుంబ సభ్యులకు గానీ ఎలాంటి సమస్యలు ఎదురైనా,సంక్షేమ ఫలాలు అందకపోయినా నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను లేదా సంబంధిత మండల న్యాయ సేవాధికార కమిటీలను సంప్రదించాలని సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయంతో పాటు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల సదుపాయాలు,ఉపకార వేతనాలు, పరికరాలు సకాలంలో అందేలా సంస్థ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల నిర్వాహకులు,ఉపాధ్యాయులు,న్యాయవాదులు,పారా లీగల్ వాలంటీర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలకు వేలాయే...

నేడే ఎంగిలి పూల బతుకమ్మ - తీరొక్క పూలతో బతుకమ్మ వేడుకలు

గొల్లపల్లి అక్టోబర్ 09 ప్రజాకలం ప్రతినిధి

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ.ప్రకృతి ఇచ్చే పూలను ఆరాధించే పండుగ బతుకమ్మ ఈ పండుగ వచ్చిందటే ఆడపడుచులకు ఎనలేని ఆనందం. తొమ్మిది రోజుల పాటు ఈ బతుకమ్మ వేడుకలను ఆడపడుచులు ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమికి ముందు వచ్చే అమావాస్యనుహొ పెత్రమాస అంటారు. ఈ బతుకమ్మ పండుగ పెత్రమాసనాడు ప్రారంభమై మహాష్టమి రోజున నద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా మొదలై, రెండవ రోజు అటుకుల బతుకమ్మ, మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాల్గవ రోజు నాన బియ్యం బతుకమ్మ, ఐదవ రోజు అట్లా బతుకమ్మ, ఆరవ రోజు అలిగిన బతుకమ్మ, ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజువెన్న ముద్దల బతుకమ్మ,తొమ్మిదో రోజు నద్దుల బతుకమ్మగా మహిళలు ఘనంగా జరుపుకుంటారు. ఈ బతుకమ్మను పేర్చేందుకు తంగేడు, గునుగు, సీతజడ, బంతి, కట్ల, మందార, పట్టకుచ్చు, గోరంట, ముళ్లగోరంట, పట్నం బంతి, తురకబంతి, చామంతి, కలువ తామర, గన్నేరు, ఉద్రాక్ష, జాజి, గుమ్మడి, సంపెంగ తదితర పూలను సేకరించి ఇంటికి తెచ్చి తీరొక్క పూలతో బతుకమ్మగా పేర్చుతారు.ఆడపడుచులు సంప్రదాయ బద్దంగా కొత్త బట్టలు కట్టుకుని గౌరీదేవిని పెట్టి పసుపు ,కుంకుమతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలంతాహొ గ్రామాలలో, పట్టణాలలో, ప్రధాన కూడళ్లు,దేవాలయాలు, వాడవాడల బతుకమ్మలను పెట్టి చప్పట్లు కొడుతూ చుట్టూ కలియహొ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడుతుంటారు. బతుకమ్మలతో ఆడిపాడిన తర్వాత నీటిలో నిమజ్జనం చేస్తారు.అనంతరం వారు బియ్యం,నువ్వులు,పల్లీలు,బెల్లంతో



తయారు చేసిన నైవేద్యాలను గౌరీదేవికి సమర్పించి తర్వాత మహిళలు ఒకరికొకరు పంచుకుంటారు.

ఎంగిలిపూల బతుకమ్మ అని ఎందుకంటారంటే..

బతుకమ్మను పేర్చెందుకు ఒకరోజు ముందే పూలను సేకరిస్తారు. పూలు తీసుకొచ్చిన వారింట్లో నీటిలోవేస్తారు. ఈపూలు ఒకరోజు నిద్ర చేస్తాయి. అలా నిద్ర చేసిన పూలతో బతుకమ్మను పేర్చడం వల్ల ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తారని పెద్దలు చెబుతారు. ముందు రోజు పూలను సేకరించడం వల్ల మొగ్గలుగా ఉన్న పూలను తెచ్చుకొని బతుకమ్మను పేర్చుతున్నప్పుడు నోటితో పూలను ఊది వాటిని పేరుస్తారు. అలా పూలను ఎంగిలిపూల బతుకమ్మ అంటారని చెబుతుంటారు. పెత్రమాస రోజు ఉదయమే లేచి చనిపోయిన పెద్దలకు నివేదనలు చేసి అనంతరం భోజనం చేసిన తర్వాత బతుకమ్మను పేర్చడం వల్ల ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తారని పలురకాల కథలు ప్రచారంలో ఉన్నాయి.

దసరాకు ఊరెళ్తున్నారా..



జగిత్యా ప్రతినిధి అక్టోబర్ 9 (ప్రజా కలం)

ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండండి!
ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం
జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల జిల్లా దసరా పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రజలు ఇళ్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. పండుగ సెలవులను ఆసరాగా చేసుకుని దొంగలు ఇళ్లలో చోరీలకు పాల్పడే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో చోరీల నివారణకు పోలీసు శాఖ తరఫున అవసరమైన చర్యలు చేపడుతున్నామని, రాత్రి వేళల్లో పోలీసు గస్తీని ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలను గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఇళ్ల భద్రతకు పోలీసుల సూచనలు

ఇంటికి తాళం వేసినప్పుడు తాళంల్ బయటకు కనిపించకుండా జాగ్రత్తపడాలి. వీలైతే ప్రధాన ద్వారాన్ని లోపలి నుంచి లాక్ చేసే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఊరికి వెళ్లే ముందు బంగారం, వెండి, నగదు వంటి విలువైన వస్తువులను ఇంట్లో సాధారణంగా కనిపించే ప్రదేశాల్లో ఉంచకూడదు. సురక్షితమైన లాకర్లలో భద్రపరచాలన్నారు. బీరువా తాళాలను ఇంట్లోని కప్‌బోర్డుల్లో లేదా ఇతర సులభంగా గుర్తించగల ప్రదేశాల్లో ఉంచకూడదన్నారు. ప్రయాణ వివరాలు, ఇంట్లో లేని సమయం, విలువైన వస్తువులకు సంబంధించిన సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దన్నారు. ఊరికి వెళ్లే విషయాన్ని నమ్మకమైన ఇరుగుపొరుగు వారికి తెలియజేసి, ఇంటిపై నిఘా ఉంచాలన్నారు. అవసరమైతే స్థానిక పోలీసులకు కూడా సమాచారం ఇవ్వాలన్నారు.రాత్రివేళ ఇంట్లో ఒక గదిలో లైట్ వెలిగేలా ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఇంటి చుట్టూ అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.ఇంటి భద్రత కోసం మొబైల్‌కు నోటిఫికేషన్లు వచ్చేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని,వీలైనంత వరకు ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలు కెమెరాల్లో కనిపించేలా చూడాలన్నారు.ఇంట్లో ఒంటరిగా ఉండే మహిళలు, వృద్ధుల వద్దకు అపరిచితులు వచ్చి సమాచారం అడిగినా, ఇతర కారణాలు చెప్పినా అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించాలని పేర్కొన్నారు. దసరా పండుగను సంతోషంగా జరుపుకునేందుకు ప్రజలు పోలీసుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్ కుమార్ కోరారు.

కూరగాయల సాగుతోనే అధిక లాభాలు

- జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్



పెద్దపల్లి,అక్టోబర్ 09:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో అధిక ఆదాయాన్నిచ్చే కూరగాయల సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు.మండలంలోని పెద్దకల్వల గ్రామంలో ప్రగతిశీల రైతు బుసనవేన మధుకర్ సాగు చేస్తున్న కూరగాయల క్షేత్రాన్ని బుధవారం ఆయన అధికారుల బృందంతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ రైతు మధుకర్ సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో బీర,కాకర,సొర,దోస,టమాట వంటి కూరగాయలను సాగు చేస్తూ ప్రతిరోజూ రూ.4వేల నుంచి రూ.5వేల వరకు నికరాదాయం పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.సాంప్రదాయ వరి పంటతో పోలిస్తే కూరగాయల సాగులో నీటి ఆదా ఎక్కువగా ఉండటంతో పాటు,తరచుగా కోతలు ఉండటం వల్ల రైతులకు క్రమం తప్పకుండా ఆదాయం సమకూరుతుందని స్పష్టం చేశారు.ఉద్యానవన శాఖ ద్వారా కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తోందని జిల్లా ఉద్యాన అధికారి తెలిపారు.తీగజాతి కూరగాయల సాగుకు అవసరమైన వెదురు కర్రలు,శాశ్వత పందిళ్ల నిర్మాణం,మల్చింగ్ షీట్లు,మేలైన కూరగాయల నారు తదితర సదుపాయాలకు నిబంధనల మేరకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.సూక్ష్మ సేద్యం పరికరాలపై ఇస్తున్న రాయితీలను వినియోగించుకుని నీటి ఎద్దడిని అధిగమించవచ్చని సూచించారు.రాబోయే రబీ సీజన్‌లో రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పంటల సాగు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఎస్. మహేష్,ఉద్యాన విస్తరణ అధికారులు బి.రాము,బి.మహేష్, సిగ్నెట్ ఇరిగేషన్ డీసీఓ బి.మనోహర్,స్థానిక రైతులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో తెలంగాణ అల్పాహార కార్యక్రమం ప్రారంభం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత: ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

బెల్లంపల్లి, అక్టోబర్ 9, (ప్రజాకలం) ప్రతినిధి. మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించి,వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ అల్పాహార కార్యక్రమాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి బెల్లంపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు.హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందించనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం,విద్యాభివృద్ధి, ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడకుండా, పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఎదిగి చదువుపై పూర్తి శ్రద్ధ చూపేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు.

విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గర్ల్స్, బాయ్స్ లో అల్పాహారం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి విద్యార్థులతో బతుకమ్మ ఆడారు...ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రయ్య , బెల్లంపల్లి ఎంఈఓ, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు,మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, స్థానిక కౌన్సిలర్ జంగం కల్పన,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో ప్రత్యేక లోక్ అదాలత్‌లు

ఎన్ఐ యాక్ట్ కేసుల పరిష్కారానికి మూడు విడతల్లో నిర్వహణ



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 9 (ప్రజాకలం) ఎన్ఐ యాక్ట్ (నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం) కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు జగిత్యాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వ ప్రచార కార్యక్రమం 3.0 నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ వెల్లడించారు.జగిత్యాల యూనిట్‌లోని అన్ని కోర్టుల్లో అక్టోబర్ 16, అక్టోబర్ 31, నవంబర్ 6 తేదీల్లో ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ఐ యాక్ట్ కేసులు ఉన్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పరస్పర రాజీ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచించింది.

ముస్లిం మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణి



బెల్లంపల్లి ,అక్టోబర్ 8, (ప్రజాకలం) ప్రతినిధి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ముస్లిం మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యఅతిగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొని, మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మెషిన్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం,అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక అనేక సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని, అందులో భాగంగానే మైనార్టీ మహిళలకు ఇందిరమ్మ పథకం ద్వారా కుట్టు మిషన్లను అందజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వరి, బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ రమేష్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్, మాజీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య తహసిల్దార్ ఎల్.కృష్ణ, మైనార్టీ నాయకులు ఎండి ఈక్రముద్దీన్ మిర్జా ఖదీర్, ఎండి అమ్మజద్ ఎండి ఖలీల్, ఎండి ఆసిఫ్, ఎస్కే యూనిస్, ఎండి ఇమ్ము,ఎండి ఇలియాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటి విడుదలకు ఆదేశాలు.. హర్షం

చివరి ఆయకట్టు వరకు నీరందించాలి - డాక్టర్ రఘు

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 09 (ప్రజాకలం):-

కోరుట్ల నియోజకవర్గ రైతుల సాగునీటి సమస్యపై ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదలకు ఆదేశాలు ఇవ్వడంపై రఘు హర్షం వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇటీవల వీడియో ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. పంటలకు అవసరమైన సమయంలోనే సాగునీరు అందించాలని, విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి నీటి సరఫరాకు ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. రైతులకు సకాలంలో సాగునీరు అందే వరకు సమస్యపై నిరంతరం దృష్టి సారిస్తామని తెలిపారు. సాగునీటి సమస్యపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వానికి డా. రఘు ధన్యవాదాలు తెలియజేశారు.



క్యాన్సర్ చికిత్సలో అధునాతన సాంకేతిక విప్లవం

- సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ సుమంత్ కుమార్

పెద్దపల్లి,అక్టోబర్ 09:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి) క్యాన్సర్ నివారణకు ప్రస్తుతం ఎన్నో అధునాతన వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని,రోగులందరికీ ఒకే రకమైన చికిత్స కాకుండా వారి శారీరక స్థితిగతులు,వ్యాధి తీవ్రతను బట్టి ప్రత్యేకమైన చికిత్స అందిస్తున్నామని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి క్యాన్సర్ మరియు రక్త సంబంధిత వ్యాధుల నిపుణులు డాక్టర్ సుమంత్ కుమార్ మల్లుపట్టు తెలిపారు. పెద్దపల్లి కమాన్ రోడ్డు ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సుమంత్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను పూర్తిగా అదుపు చేయడం లేదా వ్యాధి తీవ్రతను



తగ్గించడమే కాకుండా,రోగి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే రేడియేషన్ థెరపీ చికిత్స యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.చికిత్స ద్వారా వచ్చే దుష్ప్రభావాలను కనిష్ఠ స్థాయికి పరిమితం చేస్తూ,అవసరమైన చికిత్సను మరింత ప్రభావవంతంగా అందించడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానం ఎంతో దోహదపడుతోందన్నారు. రేడియేషన్ థెరపీ యంత్రమైన హైపర్‌సైట్ ను వినియోగిస్తున్నామని తెలిపారు.ఈ అధునాతన పద్ధతి ద్వారా క్యాన్సర్ సోకిన భాగాన్ని మాత్రమే అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకుని చికిత్స అందిస్తామని, దీనివల్ల వ్యాధి సోకని చుట్టుపక్కల ఉండే ఆరోగ్యకరమైన కణజాలానికి ఎలాంటి హానీ కలగదని వివరించారు.స్థానిక ప్రజల సౌకర్యార్థం సూర్య ప్రయోగశాలలో ప్రతి నెలా రెండు మరియు నాల్గవ బుధవారాల్లో వైద్య సేవల నిమిత్తం అందుబాటులో ఉంటానని డాక్టర్ సుమంత్ కుమార్ వెల్లడించారు.ఈ విలేకరుల సమావేశంలో యశోద ఆసుపత్రి వ్యాపార ప్రచార నిర్వహకులు లక్ష్మణరావు,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కాన్సిరాం 20 వ వర్ధంతి వేడుకలు

ధర్మారం, అక్టోబర్ 09 : (ప్రజా కలం ప్రతినిధి) బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, బహుజన నాయకత్వ దార్శనికుడు మాన్యవార్ కాన్షిరాం 20వ



వర్ధంతి వేడుకలను సుంచు మల్లేశం ఆధ్వర్యంలో శుక్రవారం రోజున ధర్మారం మండలం పత్తిపాక ఎక్స్ రోడ్ లో గల అంబేద్కర్ కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. కాన్షిరామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కాన్షిరాం బడుగు బలహీన వర్గాల రాజకీయ హక్కుల కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించు కుంటూ ఆయన ఆశయ సాధనకు ప్రతి బహుజనుడు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బహు జనులకు రాజకీయ అధికారం సాధించడమే కాన్షిరాం అంతిమ లక్ష్యం అని పేర్కొన్నారు. బహు జనులు హక్కులు ఆత్మ గౌరవం సామాజిక సమా నత్వం కోసం తన జీవి తాన్ని అంకితం చేసిన మహానీయుడు కాన్షిరాం అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో దళిత బహుజన నాయకులు మెట్పల్లి నరేష్, వడుకా పురం రవి, దీకొండ రమేష్, నేరెళ్ల లక్ష్మీరాజం, నేరెళ్ల దుర్గయ్య, నేరెళ్ల మల్లయ్య, న్యాతరి కనకయ్య, కుమ్మరి రాములు, గడ్డం భూమయ్య, గడ్డం సత్తయ్య, పులి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు కృషి చేస్తాం

- జర్నలిస్టుల సమస్యలపై సమన్వయ కమిటీ వేసుకోండి

- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణారావు





పెద్దపల్లి,అక్టోబర్ 09:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లిలోని డాక్టర్ విజయ ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులతో ఆయన ప్రత్యేక ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు తమ చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాలు, ఇండ్ల మంజూరు అంశంపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించగా,ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు యూనియన్లు, సంఘాలతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారమే ధ్యేయంగా జర్నలిస్టులంతా కలిసి ఒక ఐదుగురు సభ్యులతో కూడిన సమన్వయ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.ఆ కమిటీ ముందుకు వస్తే అధికారులతో మాట్లాడి అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.సుల్తానాబాద్,ఓదెల మండలాలతో పోలిస్తే పెద్దపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో స్థల లభ్యత కొంత క్లిష్టంగా ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల జాడను గుర్తించేందుకు అధికారులు నిరంతరం అన్వేషిస్తున్నారని వివరించారు.నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా అనువైన ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉంటే,సంబంధిత సర్వే నంబర్లను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని జర్నలిస్టులకు సూచిస్తూ,అధికారులతో కలిసి సమష్టిగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన పూర్తి భరోసా ఇచ్చారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో పెద్దపల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాల సాధన కోసం ఉద్యమిద్దాం

- ఘనంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ 16వ ఆవిర్భావ దినోత్సవం



పెద్దపల్లి,అక్టోబర్ 09:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన,ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని ప్రజా సంఘాల నేతలు స్పష్టం చేశారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం తెలంగాణ ప్రజా ఫ్రంట్ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. 2010లో ప్రజా యుద్ధనౌక గద్దర్ సారథ్యంలో ఏర్పడిన టీపీఎఫ్,పౌర హక్కులు,సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతోందని కొమురయ్య గుర్తుచేశారు.తెలంగాణ ఉద్యమకారుడు ఆకుల భూమయ్య హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల పరిరక్షణకు పీసా చట్టం అమలు,మూతపడిన నిజాం షుగర్స్, ఐడీపీఎల్ పరిశ్రమల పునరుద్ధరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, దళితులకు ఐదెకరాల భూమి,కౌలు రైతులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలని కోరారు.టీపీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు ప్రజలకిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని,ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలు చేపడతామని తెలిపారు.రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న మాట్లాడుతూ, రైతులకు గిట్టుబాటు ధరలు,పంట నష్టపరిహారం అందించి, వ్యవసాయానికి సమగ్ర విధానం తేవాలని కోరారు.దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్ మాట్లాడుతూ, బడ్జెట్‌లో విద్య,వైద్యానికి అధిక నిధులు కేటాయించాలని,నిర్బంధ చట్టాలు రద్దు చేసి ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.విశ్వనాథం,రైతు కూలీ సంఘం నాయకులు వెల్తురు సదానందం, ఎల్.భీమన్న,పౌర హక్కుల సంఘం నేత రెడ్డి రాజుల సంపత్,అరుణోదయ కళాకారుడు యాకూబ్,టీపీఎఫ్ నాయకులు కె.రాజు, అంజయ్య,దస్తగిరి,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు దక్కేదాకా విశ్రమించేది లేదు

- ఢిల్లీ వేదికగా బీసీ సంఘాల సమరశంఖం



పెద్దపల్లి,అక్టోబర్ 09:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) దేశ రాజధాని ఢిల్లీ వేదికగా బీసీ హక్కుల పరిరక్షణ పోరాటం ఉధృతరూపం దాల్చింది.జాతీయ బీసీ జేఏసీ చైర్మన్ గాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాలకు చెందిన బీసీ సంఘాల శ్రేణులు తెలంగాణ భవన్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట చేపట్టిన మహాధర్నా రెండో రోజూ హోరెత్తింది. బీజేపీ హఠావో..బీసీ బచావో' నినాదాలతో నాయకులు తమ నిరసన గళాన్ని బలంగా వినిపించారు.ఈ ఆందోళనకు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు,మాజీ ఎంపీ వి.హనుమంతరావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవితో పాటు మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల బీసీ ప్రతినిధులు,పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మాజీ ప్రజాప్రతినిధి సారయ్య గౌడ్,రాష్ట్ర నాయకుడు తాండూరి శ్రీమన్నారాయణ సహా భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరై సంఘీభావం ప్రకటించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఈ సందర్భంగా నేతలు మండిపడ్డారు.దేశవ్యాప్త జనగణనలో తక్షణమే ఓబీసీ కులగణనను చేపట్టాలని,విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయమైన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు రాజ్యాంగబద్ధమైన రక్షణ కల్పించేలా దానిని కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని స్పష్టం చేశారు. లక్ష్యాలు సిద్ధించే వరకు విశ్రమించేది లేదని తేల్చిచెప్పిన నేతలు,డిసెంబరులో చలో పార్లమెంట్-పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంతో ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

టీబీ నిర్మూలనపై రాష్ట్రస్థాయి బృందం తనిఖీ

- జగ్గాసాగర్‌లో పలు ఆరోగ్య కేంద్రాల సందర్శన



మెటపల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 09 (ప్రజాకలం): టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రాష్ట్రస్థాయి బృందం, వైద్యాధికారులు జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆత్మకూర్, అంబేద్కర్ నగర్, జగ్గాసాగర్‌తో పాటు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సాయిరాం కాలనీ ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో టీబీ చాంపియన్లు నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించి, డైలీ ట్రాకింగ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీబీ చాంపియన్ల పనితీరు, ప్రజలకు అందిస్తున్న అవగాహన కార్యక్రమాలు, క్షయవ్యాధి నిర్మూలన చర్యల అమలును సమీక్షించారు. టీబీ లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, ఉచిత చికిత్స, చికిత్సను పూర్తిచేయడం, వ్యాధి వ్యాప్తి నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు. టీబీ బాధితులకు అండగా నిలుస్తూ, చికిత్స మధ్యలో ఆపకుండా ప్రోత్సహించాలని, వ్యాధిపై సమాజంలో ఉన్న అపోహలు, వివక్షను తొలగించేందుకు కృషి చేయాలని తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, టీబీ చాంపియన్ల సమన్వయంతో పనిచేసి టీబీ నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి, డాక్టర్ మౌంటెల వాణి, టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆంజనేయులు, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి అధికారి పవన్ కుమార్, ఎం అండ్ ఈ ప్రతినిధి రాజేందర్, ఆత్మకూర్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్ కృష్ణవేణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలే విద్యార్థులకు శ్రీరామరక్ష

వాసవి చైర్మన్ పాంపాటి శ్రీకాంత్ - వాసవి స్కూల్‌లో ముందస్తు దసరా సంబరాలు



పెద్దపల్లి,అక్టోబర్ 09:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) చదువుతో పాటే విద్యార్థులకు మన సనాతన ధర్మం,భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు,పండుగల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని,ఇటువంటి వేడుకల ద్వారా వారిలో సృజనాత్మకత,ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని వాసవి స్కూల్ చైర్మన్ పాంపాటి శ్రీకాంత్ అన్నారు.స్థానిక భూమ్‌నగర్‌లోని వాసవి స్కూల్‌లో ముందస్తు దసరా వండుగ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవారి విభిన్న రూపాల్లో వేసిన వేషధారణలు,ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి విశిష్టతను,రావణ సంహారం వెనుక ఉన్న పౌరాణిక నేపథ్యాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

అనంతరం పాఠశాల ఆవరణలో సంప్రదాయబద్ధంగా జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ మానస,స్థానిక కౌన్సిలర్ సుజాత,డాక్టర్ కౌటిల్య,శ్యామల,ఉపాధ్యాయులు కృష్ణవేణి, సౌమ్య, అంజలి,ప్రిన్సి,సమ్రీన్ తదితరులు పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి


- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 9 (ప్రజాకలం) : వివిజిరాంజీ కింద జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి నిర్మాణ పనులు గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, వంటశాలల నిర్మాణాలు, పాఠశాలల మరుగుదొడ్లు) నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, పాఠశాలల్లో వంటశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడే ఈ నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్మాణాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టిన పనులు



ఓట్ల తొలగింపు రాజ్యాంగ విరుద్ధం

- పెద్దపల్లిలో ముస్లిం ఐక్యవేదిక నిరసన



పెద్దపల్లి,అక్టోబర్ 09:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రజాస్వామ్యంలో పౌరుడికి అత్యంత పవిత్రమైన ఓటు హక్కును అన్యాయంగా కాలరాస్తున్నారని,ఎస్ఐఆర్ పేరుతో కోట్లాది మంది ఓట్లను తొలగించి రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నారని ముస్లిం ఐక్యవేదిక నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ అప్రజాస్వామిక ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని,ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్దపల్లిలో నిరసన ప్రదర్శన నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ముస్లిం ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ 2023 చట్టం ద్వారా ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పించి అధికార వక్షానికి అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగాలంటే పాత పద్ధతిలోనే సీజేఐ భాగస్వామ్యంతో కూడిన కమిటీ ద్వారా నియామకాలు చేపట్టాలని,తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో జామా మసీదు మౌలానా మహమ్మద్ అజీముద్దీన్ అహ్మద్, ముస్లిం నేతలు సయ్యద్ మస్రత్,అబ్దుల్ హై జావిద్, కౌన్సిలర్లు మీర్జా షంషేర్ బేగ్,అస్లాం పర్వేజ్, సల్మాన్,సిపిఐ నేతలు బాలసాని లెనిన్, కల్లేపల్లి నవీన్,కుక్క శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరచాలి

సర్కార్ దవాఖానాల్లో మెరుగైన వైద్యం అందించాలి

ఎన్సీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మద్దిశెట్టి సామేలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 09: (ప్రజా కలం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని ఎన్సీపీ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎన్డీఏ మహాకూటమి, ఎన్సీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దిశెట్టి సామేలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం, సరిపడా మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సౌకర్యం, సరైన నివాస గదులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా ఇటీవల కలుషిత ఆహారం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆహార నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సంబంధిత అధికారులు ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు.



పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారకూడదు

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారకూడదని మద్దిశెట్టి సామేలు అన్నారు. ప్రభుత్వ దవాఖానాల్లో ఉచితంగా, నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు, తగిన సంఖ్యలో వైద్యులు మరియు సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

గ్రీవెన్స్ లో కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేత

ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాబోయే సోమవారం నిర్వహించే ప్రజావాణి గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎన్సీపీ, ఎన్డీఏ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్లు మరియు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు.ప్రభుత్వం ఈ సమస్యలను ప్రాధాన్యతగా పరిగణించి, విద్యార్థుల సంక్షేమం, పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వెంటనే చర్యలు చేపట్టాలని మద్దిశెట్టి సామేలు విజ్ఞప్తి చేశారు.



"మోర్తాడ్‌లో కాన్షీరాంకు ఘన నివాళి: బహుజన విప్లవ సూర్యుడికి పూలమాలల శ్రద్ధాంజలి!"

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 09:

బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతి (అక్టోబర్ 9) సందర్భంగా నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో బహుజన నాయకులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. మోర్తాడ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నాయకులు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బహుజన నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాల సామాజిక మార్పు, రాజకీయ సాధికారత కోసం కాన్షీరాం చేసిన పోరాటం మరువలేనిదన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో బామ్‌సెఫ్ డిఎస్-4 లతో పాటు 1984లో బీఎస్పీని స్థాపించి భారత రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం, బహుజనుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బహుజన ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలి

60 శాతం ఉద్యోగాలు కల్పించాలని బండారి శ్రీశైలం డిమాండ్

బీబీనగర్, అక్టోబర్ 09 (ప్రజాకలం)

బీబీనగర్ ఎయిమ్స్‌లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో స్థానిక



యువతకు 60 శాతం అవకాశాలు కల్పించాలని సోషలిస్ట్ నాయకుడు బండారి శ్రీశైలం డిమాండ్ చేశారు. ఈ మేరకు బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎయిమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా అర్హతలున్న స్థానిక యువతకు డేటా ఎంట్రీ, సాంకేతిక విభాగాలు, వార్డు బాయ్స్, భద్రత, క్యాంటీన్ తదితర ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఒగ్గు నాగరాజు, మహమ్మద్ రషీద్, మహమ్మద్ అజ్జర్, పొట్ట మనోహర్, పంజాల సాయికిరణ్, సన్నీ గౌడ్, సురేష్, కట్ట లక్ష్మణ్, కట్ట కిషోర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



వాహనదారులు ఇబ్బంది పడకూడదు : రవీందర్ ముదిరాజ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) బౌరంపేట్ గ్రామం నుండి సూరారం, షాపూర్ నగర్, బాలానగర్, బాచుపల్లి వెళ్లేవారు, కిలోమీటర్ వచ్చి, నాలుగు రోడ్ల చౌరస్తాకు వచ్చి తిరిగిపోతున్నారు. వారి ఇబ్బందులను గ్రహించి, పెద్ద పెద్ద వాహనాలు, 10,12,16, చక్రాల వాహనాలు అక్కడ, రిటర్న్, తిరగాలంటే తీవ్ర ఇబ్బందిని చూసి, వెంటనే స్పందించి పక్కనుండి రాళ్లను సేకరించి రోడ్డు అడ్డంగా పెడుతున్న దృశ్యం ప్రతి వాహనదారుడు, టూ వీలర్ మొదలు భారీ వాహనం వరకు బౌరంపేట, మల్లన్న గుడి నుండి ఎడమ పక్కకు తిరిగి ఇందిరమ్మ విగ్రహం ఎదురుగుండా బహదురుపల్లి ఎక్స్ రోడ్, సాయినాథ్ సొసైటీ లే అవుట్ సాయిబాబా మందిరం ఎదురు నుండి, బహదురుపల్లి ప్రభుత్వ కాలేజీ పక్క నుండి పెట్రోల్ పంప్ ఎదురుగా సూరారం, షాపూర్ నగర్, బాలానగర్, వెళ్ళవచ్చు అందుకు రోడ్డు అడ్డంగా రాళ్లు ఏర్పాటు చేశారు. ఒకప్పటి లారీ యజమాని ట్విన్ సిటీ నార్త్ రన్ ఇసుక లారీ యజమానుల సంఘం మాజీ కార్యదర్శి, సామాజిక, పర్యావరణ ప్రేమికులు కోలా రవీందర్ ముదిరాజ్ ఒక వారం క్రితం సూరారం ఎక్స్ రోడ్ నుండి రెండు కిలోమీటర్లు వెళ్లి తిరిగి వస్తున్న వాహనదారులకు స్వంత ఖర్చుతో మూడు బ్యానర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో వాహనదారులకు, సమయం, ఇంధనం ఆదా అవుతుందని ఆయన పేర్కొన్నారు.

బధిరులకు అండగా నిలవాలి: పోలీస్ కమిషనర్

- గ్రేసీ ఆర్గనైజేషన్‌లో విద్యార్థులతో ఆత్మీయ ముఖాముఖి



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 09: సమాజంలో బధిర విద్యార్థులు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పోలీసు సిబ్బంది సానుభూతితో అర్థం చేసుకొని వారికి ఎల్లప్పుడూ అండగా నిలవాలని జిల్లా పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు. శుక్రవారం టౌన్-4 పోలీస్ స్టేషన్ పరిధిలోని 'గ్రేసీ ఆర్గనైజేషన్ ఫర్ డెవలప్మెంటల్ సర్వీసెస్' లో బధిర విద్యార్థుల సమస్యలు, వాటి పరిష్కారంలో పోలీసుల పాత్రపై సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బధిరులు తమ సమస్యలను సాధారణంగా మాట్లాడి వ్యక్తపరచలేని పరిస్థితుల్లో ఉంటారని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో సిబ్బంది ఎంతో సామరస్యంగా, గౌరవప్రదంగా వ్యవహరించాలని సూచించారు. ఏదైనా ఫిర్యాదుతో వస్తే నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన చోట సంజ్ఞా భాష (సైన్ లాంగ్వేజ్) తెలిసిన వ్యక్తుల సహాయం తీసుకుని బాధితులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలన్నారు. పోలీస్ శాఖ ప్రజలందరికీ సమానంగా సేవలు అందించే వ్యవస్థ అని, ముఖ్యంగా దివ్యాంగుల పట్ల మరింత సహనం, మానవీయ దృక్పథంతో మెలగాలని సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థులకు భోజనం వడ్డించిన సీపీ: అనంతరం బధిర విద్యార్థులతో కమిషనర్ ఆత్మీయంగా ముచ్చటించారు. వారికి పుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులను అందజేశారు. విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి కాసేపు సమయం గడిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భద్రతాభావం పెంపొందించడంతో పాటు, పోలీసు సిబ్బందిలో సామాజిక అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, సీసీఆర్‌బీ ఏసీపీ గురు నాయుడు, స్థానిక సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే గ్రేసీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ ఆర్. శోభారాణి, సెక్రెటరీ జనరల్ సెక్రెటరీ వైస్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా

ధాన్యం కొనుగోళ్లు జరపాలి

: పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య -కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

-రైస్ మిల్లర్లు, అసోసియేషన్ ప్రతినిధులతో నిజామాబాద్ సీపీ సమీక్ష



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 09:

జిల్లాలోని రైతులకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు, విక్రయాలు బాధ్యతాయుతంగా చేపట్టాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. సూచించారు. నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ల ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో సీపీ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు, ధాన్యం దిగుబడులు, కొనుగోళ్లు, విక్రయాలతో పాటు ప్రజలకు సరసమైన ధరలకే బియ్యం అందించేలా తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఇది వంటల సాగు, దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.

ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు, విక్రయాల్లో నిబంధనల ప్రకారం వ్యవహరించాలని స్పష్టం చేశారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని అధిక ధరలకు ఇతర ప్రాంతాలకు తరలించడం లేదా మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు, అనుమతులు, ధరల మార్గదర్శకాలకు అనుగుణంగానే వ్యాపారాలు సాగాలని స్పష్టం చేశారు. సామాన్య ప్రజలపై అదనపు ధరల భారం పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రైతుల కష్టాన్ని గుర్తించి వారి ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ప్రజలకు నిత్యావసరమైన బియ్యం సరసమైన ధరలకే లభించేలా రైస్ మిల్లర్లు, అసోసియేషన్ల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోళ్లు, నిల్వలు, రవాణా, విక్రయాల విషయంలో సంబంధిత ప్రభుత్వ శాఖల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సీపీ కోరారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం. శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బి. ప్రవీణ్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లేశం, జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ సెక్రెటరీ మోహన్ రెడ్డి, పలువురు రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ డివ్యూటీ తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల దొంగలపై నిఘా పెట్టాలి

-పెంపకందారులకు రక్షణ కల్పించాలి..

-పోలీసులకు గొర్ల కాపర్ల సంఘం వినతి



బీబీనగర్, అక్టోబర్ 09 (ప్రజాకలం) గొర్రెలు, మేకలే జీవనాధారంగా బతుకుతున్న కాపర్లకు దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామాల్లో పశువుల చోరీలను అరికట్టి, పెంపకందారులకు భరోసా కల్పించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ కోరారు. ఈ మేరకు శుక్రవారం బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సూర్య నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గొర్రెలు, మేకలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరిస్తుండటంతో కాపర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని వారు వివరించారు. రాత్రి వేళల్లో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని, మందలు ఉండే ప్రాంతాలపై నిఘా ఉంచాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పరిశీలించి, చోరీలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పశుసంపదను కాపాడటంతోపాటు గొర్రెలు, మేకల పెంపకందారులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చీర ఐలయ్య కురుమ, గుదె శ్రీశైలం కురుమ, అందె యాదగిరి కురుమ, ఎస్.కె. హుస్సేన్, పర్వతం శ్రీశైలం యాదవ్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు గంజి శివకుమార్, కడెం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రమాద బీమా చెక్కు అందజేత

భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 9 (ప్రజా కలం)

బీమనపల్లి గ్రామానికి చెందిన మీసాల యాదయ్య, తండ్రి వెంకయ్య, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో, బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ వారి సౌజన్యంతో మంజూరైన రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయలు) ప్రమాద బీమా చెక్కును బీమనపల్లి గ్రామ సర్పంచ్ కర్నాటి వరలక్ష్మి పాండు చేతుల మీదుగా మీసాల మంజులకు అందజేయడం జరిగింది. పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అందిస్తున్న సేవలను కొనియాడారు. బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అందుతున్న సేవలు, ప్రమాద బీమా వంటి ప్రయోజనాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో ఖాతా ప్రారంభించి, బ్యాంకు అందించే వివిధ సేవలను సద్వినియోగం చేనుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగాదేవిగురువయ్య,వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజర రచ్చ.శ్రీనివాస్ మరియు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామంలో నీటి సమస్యపై సర్పంచ్ తక్షణ చర్యలు

బీసీ,ఎస్సీ కాలనీల్లో కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు నిర్ణయం

బీబీనగర్, అక్టోబర్ 09 (ప్రజాకలం)

మండలంలోని మగ్దుంపల్లి గ్రామ బీసీ, ఎస్సీ కాలనీల్లో దెబ్బతిన్న నీటి పైప్‌లైన్ కారణంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న సర్పంచ్ శిగ నరేష్‌గౌడ్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పైప్‌లైన్‌ను పరిశీలించా రు.సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పాత పైప్‌లైన్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలనీలకు నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.నీటి సమస్యపై సర్పంచ్ వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థి ప్రతిభకు కల్వకుంట్ల కవిత చేయూత

జాతీయస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైన సాయి కృష్ణకు రూ.20 వేల ఆర్థిక సాయం

బీబీనగర్, అక్టోబర్ 09 (ప్రజాకలం) మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి. సాయి కృష్ణ రూపొందించిన




'పోర్టబుల్ కుకింగ్ స్టాండ్ ఫర్ కుక్ సేఫ్టీ' ప్రాజెక్టు జాతీయస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైంది. ఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఖర్చుల కోసం తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. విద్యార్థి ఆర్థిక ఇబ్బందులను స్థానిక నాయకుడు బాషబోయిన బాలప్రసాద్ ఆమె దృష్టికి తీసుకెళ్లగా స్పందించి సాయం ప్రకటించారు. ఆ నగదును బాలప్రసాద్ గురువారం పాఠశాలలో సాయికృష్ణకు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల వంటపని, భద్రతకు ఉపయోగపడేలా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు విద్యార్థి తెలిపాడు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యుడు బింగి సంజయ్‌కుమార్, ప్రాజెక్టు గైడ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయనిధి అండ

లబ్ధిదారురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన సర్పంచ్

బీబీనగర్, అక్టోబర్ 07(ప్రజాకలం): ముఖ్యమంత్రి సహాయనిధి పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని రాఘవాపురం గ్రామ సర్పంచ్ సిద్ధగోని శ్రీకాంత్ గౌడ్ అన్నారు.భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో, పీఏసీఎస్ చైర్మన్ పొట్లోళ్ల శ్యామ్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన గొలనుకొండ పద్మకి రూ. 8500 సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మేకల కుమారస్వామి, అంబటి జంగయ్య, సిద్ధగోని యాదగిరి, రక్తని జంగయ్య, గోలను కొండ మురళి, అంబటి మహేష్,తేజ తదితరులు పాల్గొన్నారు.





డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- నిందితుల నుండి ఒక కారు, 1 లక్ష 70 వేలు రూ.లు స్వాధీనం.

- 16 ప్లాస్టిక్ క్యాన్లు,ప్లాస్టిక్ పైపు,మొబైల్ ఫోన్ స్వాధీనం.

- పరారీలో మరో ఐదుగురు నిందితులు

- కేసు వివరాలు వెల్లడించిన రామన్నపేట సీఐ రవి.

వలిగొండ అక్టోబర్ 9 ప్రజాకలం:

అర్ధరాత్రి ఆగి ఉన్న వాహనాలు లక్ష్యంగా చేసుకొని డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని వలిగొండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు రామన్నపేట సీఐ రవి విలేకరుల సమావేశంలో తెలిపారు.గత నెల సెప్టెంబర్ 21,29 తేదీలలో వలిగొండ మండలంలోని లోతుకుంట గ్రామానికి చెందిన వ్యక్తులు తమ లారీలను మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంకు వద్ద నిలిపి ఉంచగా రాత్రి సమయంలో ఆగి ఉన్న లారీ డీజిల్ ట్యాంకర్ తాళం



పగలగొట్టి మూడు లారీల్లో సుమారు 750 లీటర్ల డీజిల్ను క్యాన్లలో నింపుకుని పారిపోయారు.అలాగే నాగారం హెచ్ పి పెట్రోల్ బంక్ లో 250 లీటర్ల డీజిల్ ను దొంగతనం చేయగా,లారీ యాజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.భువనగిరి,వలిగొండ ప్రాంతాలలో చోరీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.శుక్రవారం ఉదయం తెల్లవారుజామున 5 గంటల సమయంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు.హైదరాబాదులోని న్యూ అల్లాపూర్ బోరబండకు చెందిన సయ్యద్ సోహెల్ (22) డ్రైవర్ (అలియాస్ పప్పు సోహెల్) అద్దెకు తీసుకున్న కారులో వస్తుండగా అనుమానంతో వారిని పట్టుకుని విచారించగా చేసిన దొంగతనాలను అంగీకరించారు.కాగా గతంలో సోహెల్ చంచల్ గూడ జైలులో ఉన్నప్పుడు గణేష్ తో పరిచయం ఏర్పరచు కున్నాడు.పరిచయమైన గణేష్,సల్మాన్,షఫీ,ఇమ్రాన్ వీరందరూ కేసులో నిందితులుగా ఉన్నారు.వారి నుంచి డీజిల్ విక్రయించగా వచ్చిన డబ్బులు 1,70,000, నీలిరంగు బలేనో కారు,బరన్ రాడ్,మొబైల్ ఫోను,16 ప్లాస్టిక్ క్యాన్లు,ప్లాస్టిక్ పైపును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.అత్యంత చాకచక్యంగా నిందితులను పట్టుకున్న ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, పోలీసు సిబ్బందిని సీఐ రవి అభినందించారు.

భారత రాజ్యాంగాన్ని పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి: శేషగిరి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) భారత రాజ్యాంగాన్ని పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల



శేషగిరి పేర్కొన్నారు. శుక్రవారం భారత రాజ్యాంగాన్ని పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని కోరుతూ రాజ్యాంగ అంజన్న నేతృత్వంలో ఏర్పాటైన దీక్ష శిబిరాన్ని బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాజ్యాంగం విలువ ప్రతి ఒక పౌరుడికి తేలవాల్సిన బాధ్యత ఉందన్నారు. రాజ్యాంగాన్ని పాఠాలు చేరిస్తే విద్యార్థి దశ నుండే చరిత్ర తెలుస్తుందని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గట్టు అశోక్, లక్ష్మణ్, సత్యనారాయణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ మీడియా కన్వీనర్‌గా కె. గురునాథరావు నియామకం

మేడిపల్లి అక్టోబర్ 9(ప్రజాకలం న్యూస్)

బీజేపీ రాష్ట్ర లేబర్ సెల్ కన్వీనర్ అందె శ్రీనివాస్,జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ దాసరి మహేష్ యాదవ్ చేతులమీదుగా మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ మీడియా కన్వీనర్‌గా కె. గురునాథరావు నియమితులయ్యారు.ఈ సందర్భంగా, గురునాథరావు మాట్లాడుతూ తాను జిల్లా లేబర్ సెల్ మీడియా కన్వీనర్ గా నియమితులైనందుకు సంతోషంగా ఉందని పార్టీ నియమాలను తప్పకుండ పాటిస్తానని, ఇచ్చిన ఈ బాధ్యతను అంకిత భావంతో, పారదర్శకంగా పనిచేస్తానని, పార్టీ అభివృద్ధి కోసం ఎనలేని సేవలు తగు కృషి చేస్తానని తన సేవలను గుర్తించి నా పదవి కోసం సహాయ పడిన రాష్ట్ర లేబర్ సెల్ కన్వీనర్ అందె శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్,జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ దాసరి మహేష్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలకు కొత్త భవనం

CURE నిధులు మంజూరు..

నిర్మాణ ప్రణాళికపై ఉపాధ్యాయులతో చర్చించిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాకలం, కుత్బుల్లాపూర్:

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా CURE పరిధిలో ప్రభుత్వం కేటాయించిన నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు నిధులు మంజూరు కావడంతో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పాఠశాలను సందర్శించారు. నూతన భవన నిర్మాణ ప్రణాళికపై ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాల అవసరాలు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు, భవన నిర్మాణ విధానం తదితర అంశాలపై ఉపాధ్యాయుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన విద్యా వాతావరణం కల్పించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలు

దసరా సెలవులను పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలను నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా జరుపుకున్నారు. వేడుకలతో పాఠశాల ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది.

మీర్పేట్ 60వ డివిజన్ లో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన మాజీ కార్పొరేటర్ గజ్జల రామచందర్



మహేశ్వరం, అక్టోబర్ 09 (ప్రజా కలం) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచనలతో 60వ డివిజన్ మీర్పేట్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్, ఆఫీసర్స్ కాలనీలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బసి గూడెం బల్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జల రామచందర్ హాజరై చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ నగర్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మంద బలరాం, కళావతి, సమరీన్ సుల్తానా, జహీర్, ఆర్పీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వేసవిలో తాగునీటి కొరత రాకుండా

ముందస్తు చర్యలు

మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్



మహేశ్వరం, అక్టోబర్ 09, (ప్రజా కలం) మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నాడు గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు హాజరై గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు రాబోయే కాలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

ముఖ్యంగా తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ, ప్రస్తుత సంవత్సరం ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదని, దీని వల్ల రాబోయే వేసవిలో తాగునీటి కొరత తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుండే ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.

వాటర్‌మెన్‌లకు ఆదేశాలు:

గ్రామంలో సరఫరా చేస్తున్న తాగునీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయకుండా చూడాలని వాటర్‌మెన్‌లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. నీటి సరఫరా సమయంలో పైప్‌లైన్ లీకేజీలు, అనవసరంగా నీరు వృథా అవుతున్న ప్రాంతాలను గుర్తించి వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

ప్రజలకు విజ్ఞప్తి:

గ్రామ ప్రజలు తాగునీటి విలువను గుర్తించి నీటిని పొదుపుగా వాడాలని కోరారు.

ప్రతి ఇంటి వాటర్ కనెక్షన్‌కు తప్పనిసరిగా ట్యాప్‌లు బిగించుకోవాలని సూచించారు. ట్యాప్‌లు లేకుండా నీటిని వృథా చేస్తున్న ఇళ్లను సిబ్బంది ద్వారా గుర్తించి, పెనాల్టీలు వేయడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల సంరక్షణ, పైప్‌లైన్ లీకేజీల నివారణ, నీటి నరఫరా వ్యవస్థ పర్యవేక్షణను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ మునగపాటి నవీన్, ఉప సర్పంచ్ జొరల రమేశ్, వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరబాబు, సున్నం స్వప్న, జటావత్ రుక్మేష్, రెవెళ్ల చంద్రమౌళి మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ సెక్రటరీ సోహెల్ ఖాన్‌కు ఘన సన్మానం



వేములవాడ అక్టోబర్ 9 (ప్రజా కలం ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెక్రటరీగా ఇటీవల ఎన్నికైన సోహెల్ ఖాన్‌ను శుక్రవారం వేములవాడ పట్టణ జామా మసీదులో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు రజాక్, జామా మసీద్ సదర్ నవాబ్ ఖాన్, ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం సెక్రటరీ సోహెల్ ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి, తనను సన్మానించిన మైనార్టీ నాయకులకు, మత పెద్దలకు, కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకుంటానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. వారితోపాటు ఈ కార్యక్రమంలో పాత్రికేయుడు ఆసిమొద్దీన్, మైనార్టీ నాయకులు రఫిక్, బాబా,క్రైఫ్ పలువురు మైనార్టీ యువకులు, పాల్గొన్నారు.



విద్యార్థులు క్రమశిక్షణతో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి సతీష్ గౌడ్

భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 9 ప్రజా కలం


విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, అప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి సతీష్ గౌడ్ అన్నారు .శుక్రవారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని లీడేల్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, చిన్నారులు విభిన్న వేషధారులతో ఆటపాటలతో అందరిని అలరించారు.అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ పసునూరు ప్రభాకర్, పాఠశాల చైర్మన్ కర్నాటి శ్రవణ్ కుమార్, ప్రిన్సిపల్ మాస్టర్ కాశినాథ్, సీత హరిప్రసాద్, ఆర్ల లింగస్వామి యాదవ్, మహమ్మద్ ఆజం, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ ప్రజల ఆరోగ్య రక్ష

- మన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు

-క్యాన్సర్ తో బాధపడుతున్న వ్యక్తికి మూడు విడతల్లో 10 లక్షల విలువ గల ఎల్వోసీ మంజూరు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 130 – సుభాష్ నగర్ డివిజన్ సూరారంకు చెందిన కొడవాటి లక్ష్మీ నర్సింహ తండ్రి కె.శ్రీనివాస్ రావు గత కొన్నేళ్లుగా క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ఈవిషయాన్ని స్థానిక నాయకుల



ద్వారా తెలుసుకున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ బాధితుడికి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మొదటి విడత రూ.3,00,000/- లక్షలు, రెండవ విడత రూ.4,00,000/- లక్షలు మంజూరు కాగా తాజాగా మూడవ విడత రూ.3,00,000/- లక్షల రూపాయలను మంజూరు చేయించారు. శుక్రవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసి పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ ప్రజల ఆరోగ్య రక్షకులు, ప్రజల బాగోగుల కోసం ప్రతీ క్షణం పనిచేసే నాయకులు ఎమ్మెల్యే, కేపీ.వివేకానంద్ అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, కట్టా సుందర్, సుకుమార్, విజయ్, ప్రభాకర్, శివ గౌడ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా రాకేష్ ముదిరాజ్

నియామక పత్రం అందజేసిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి

ప్రజాకలం, కుత్బుల్లాపూర్:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్‌కు చెందిన ఎం. రాకేష్ ముదిరాజ్ మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఎన్ఎస్‌యూఐ (NSUI) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించిన అనంతరం, హన్మంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ రాకేష్ ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని, విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ ఎన్ఎస్‌యూఐ సంస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి విద్యార్థులకు, ప్రజలకు సేవలందిస్తూ రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు.





రైతుల వెన్నంటి నిలవాలి

- సింగిల్ విండోలు సత్తా చాటాలి!

- ఎల్‌నినోపై అప్రమత్తతతోనే సాగుకు భరోసా.

-నూతన పాలకవర్గాలకు ప్రభుత్వ విప్ దిశానిర్దేశం.

వేములవాడ, అక్టోబర్ 9 (ప్రజా కలం ప్రతినిధి) :

నూతనంగా ఎన్నికైన ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు రైతులకు మెరుగైన సేవలందిస్తూ ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధిగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు.వేములవాడ మండల ప్రాథమిక సహకార సంఘం నూతన చైర్మన్ వకుళాభరణం శ్రీనివాస్, పాలకవర్గ సభ్యుల అభినందన సభకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. సుమారు 22 గ్రామాలకు సేవలందించే సంఘానికి బాధ్యతలు చేపట్టినవారు రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు,పార్టీ కోసం కష్టపడిన నాయకుల సేవలను గుర్తించి భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పిస్తామని ఆది శ్రీనివాస్ తెలిపారు. పదవులు దక్కని వారు నిరుత్సాహపడవద్దని సూచించారు. సీనియర్ నాయకుల అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తూ, సామాజిక సమతుల్యతను పాటిస్తూ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 13 సింగిల్ విండో సహకార సంఘాల్లో 12 చోట్ల చైర్మన్లు, పాలకవర్గ సభ్యుల ఎంపిక పూర్తయిందని, మిగిలిన చోట కూడా ఏకాభిప్రాయంతో త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

పంటల ఎంపికలో జాగ్రత్తలు

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణుల సూచనల మేరకు పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. మారుపాక రైతు వేదికలోనూ వాతావరణ పరిస్థితులు, పంటల ఎంపికపై అవగాహన కల్పించినట్లు గుర్తుచేశారు. జూన్ చివరి నుంచి వర్షాలు కురవడంతో రైతులకు కొంత ఊరట లభించిందని, ఈసారి వరి పంట చేతికందే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.సన్నవడ్లు సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆది శ్రీనివాస్ తెలిపారు. కనీస మద్దతు ధరకు అదనంగా బోనస్ అందడం రైతులకు ప్రయోజనకరమన్నారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో రైతులు సన్నవడ్లు సాగు చేస్తున్నారని, మార్కెట్‌లో మెరుగైన ధరలు లభించడం ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేసి రైతులకు అండగా నిలిచారని గుర్తుచేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన సేవలు అందించడంలో సింగిల్ విండో సంఘాలు కీలక పాత్ర పోషించాలని ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, నూతన ప్రాథమిక సహకార సంఘం పాలవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

మహేశ్వరంలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమం

- ముఖ్య అతిథిగా ఎంపీడీఓ ఎన్ శారదమ్మ ,

సర్పంచ్ మునగపాటి నవీన్

మహేశ్వరం, అక్టోబర్ 09, (ప్రజా కలం)

మహేశ్వరం గ్రామంలో జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల ఆసుపత్రి ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని కూరగాయల మార్కెట్ ప్రాంతం, పరిసరాలను శుభ్రపరచి సుమారు 80 కిలోల చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ ఎన్. శారదమ్మ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ విరాజ్ కుమార్ మాట్లాడుతూ – పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని తెలిపారు.గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ – జిమ్స్ కళాశాల యాజమాన్యానికి, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. మహేశ్వరం గ్రామాన్ని ప్రతిరోజూ శుభ్రం చేస్తూ, స్వచ్ఛ గ్రామంగా ఉంచడానికి పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం కష్టపడుతున్నారని కొనియాడారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు:

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ఈ రోజు కార్మికులందరికీ బీపీ, షుగర్, పల్స్ వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునగపాటి నవీన్, ఎంపీడీఓ ఎన్. శారదమ్మ, ఉప సర్పంచ్ జొరల రమేశ్, వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరబాబు, సున్నం స్వప్న, జటావత్ రుకేష్, రెవెళ్ల చంద్రమౌళి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణీష్, మెడికల్ ఆఫీసర్ డా. స్నేహిత, జిమ్స్ విద్యార్థినీ విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వాతావరణం మారినా..


ప్రయాణం ఆగదు!

ట్రావెల్ ఇన్సూరెన్స్‌తోనే ముందస్తు రక్షణ

- వాతావరణ అంతరాయాల వేళ.. ట్రావెల్ ఇన్సూరెన్స్ అండ!

- ప్రతికూల పరిస్థితుల్లో ప్రయాణ రద్దు, విమానాల ఆలస్యం, అదనపు వసతి ఖర్చులకు రక్షణ

-బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ రాకేశ్ కౌల్ వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 9 (ప్రజా కలం ప్రతినిధి)

నేటి రోజుల్లో ప్రయాణాలు కొత్త అనుభవాలను అందిస్తున్నా.. వాతావరణ పరిస్థితులు అనుకోని ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ఆకస్మిక తుపాన్లు, భారీ వర్షాలు, వరదలు, తీవ్రమైన వడగాలులు, కార్చిచ్చుల కారణంగా విమానాల రాకపోకలు నిలిచిపోవడం, ప్రయాణాలు రద్దు కావడం, గమ్యస్థానాలకు చేరడంలో జాప్యం జరగడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఫలితంగా ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ట్రావెల్ ఇన్సూరెన్స్ ప్రయాణికులకు ఆర్థిక రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

ఏయే ఖర్చులకు రక్షణ లభిస్తుంది?

ప్రయాణ రద్దు: ప్రతికూల వాతావరణం కారణంగా ప్రయాణాన్ని రద్దు చేసుకోవాల్సి వస్తే.. పాలసీ నిబంధనలకు అనుగుణంగా తిరిగి పొందలేని విమాన టికెట్లు, హోటల్ బుకింగ్‌లు, ముందస్తుగా చెల్లించిన పర్యాటక ప్యాకేజీల ఖర్చులకు పరిహారం లభించే అవకాశం ఉంటుంది.

విమానాల ఆలస్యం: వాతావరణ పరిస్థితుల వల్ల విమానం ఆలస్యమైతే.. నిర్ణీత సమయ పరిమితి దాటిన సందర్భాల్లో భోజనం, వసతి వంటి ఖర్చులకు కొన్ని పాలసీలు పరిహారం అందిస్తాయి. అయితే ఆలస్యానికి సంబంధించిన నిబంధనలు, పరిహార పరిమితులు పాలసీని బట్టి మారుతాయి.

కనెక్టింగ్ విమానం మిస్ అయితే: ప్రతికూల వాతావరణం కారణంగా మొదటి విమానం ఆలస్యమై, తదుపరి విమానాన్ని అందుకోలేకపోతే.. ప్రత్యామ్నాయ ప్రయాణం, అదనపు వసతి వంటి ఖర్చులకు పాలసీ నిబంధనల ప్రకారం రక్షణ లభించవచ్చు. ఉదాహరణకు.. మంచు తుపాను కారణంగా అంతర్జాతీయ కనెక్టింగ్ విమానం మిస్ అయినప్పుడు రీబుకింగ్, రాత్రి బస ఖర్చులకు పరిహారం లభించే అవకాశం ఉంటుంది.

మధ్యలోనే పర్యటన ముగిస్తే: ప్రకృతి వైపరీత్యాల కారణంగా పర్యటనను ముందుగానే ముగించాల్సి వచ్చినప్పుడు.. ఉపయోగించని హోటల్ బుకింగ్‌లు, ముందస్తుగా చెల్లించిన పర్యాటక సేవల ఖర్చులకు కొన్ని పాలసీలు పరిహారం అందిస్తాయి. ఇందుకు సంబంధిత నిబంధనలు వర్తిస్తాయి.

అదనపు వసతి ఖర్చులు: తుపాన్లు, వరదలు లేదా ఇతర ప్రతికూల పరిస్థితుల కారణంగా విమానాన్ని మరో నగరానికి మళ్లించడం వల్ల అక్కడే రాత్రి బస చేయాల్సి వస్తే.. అర్హత కలిగిన హోటల్ ఖర్చులను పాలసీ పరిధిలో తిరిగి పొందవచ్చు. ఇందుకు హోటల్ రసీదులు, విమానయాన సంస్థ జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు అవసరమవుతాయి.

లగేజీ ఆలస్యమైనా..: విమానాశ్రయాల మూసివేతలు, విమానాల దారి మళ్లింపుల వల్ల లగేజీ ఆలస్యంగా చేరితే.. దుస్తులు, టాయిలెట్రీలు వంటి అత్యవసర వస్తువుల కొనుగోలుకు కొన్ని పాలసీలు పరిహారం అందిస్తాయి. అయితే ఇందుకు ప్రత్యేక కవరేజీ, నిర్ణీత సమయ పరిమితులు వర్తించవచ్చు.

ముందస్తు జాగ్రత్తలతో ఆర్థిక భద్రత

సరైన పాలసీని ఎంచుకోవాలి: విదేశీ పర్యటనలకు వెళ్లేవారు తుపాన్లు, వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే ప్రయాణ అంతరాయాలకు కవరేజీ ఉందో లేదో పరిశీలించాలి. ప్రయాణ రద్దు, విమానాల ఆలస్యం, పర్యటన మధ్యలో నిలిచిపోవడం, అత్యవసర వైద్య ఖర్చులకు సంబంధించిన నిబంధనలను ముందుగానే తెలుసుకోవాలి.

వాతావరణ హెచ్చరికలపై దృష్టి పెట్టాలి: ప్రయాణానికి ముందు, ప్రయాణ సమయంలో స్థానిక వాతావరణ నివేదికలు, ప్రభుత్వ ప్రయాణ సూచనలు, విమానయాన సంస్థల ప్రకటనలను గమనించాలి. ఇప్పటికే తెలిసిన లేదా బహిరంగంగా ప్రకటించిన వాతావరణ ఘటనల కారణంగా ఏర్పడే నష్టాలకు పాలసీ వర్తించకపోవచ్చు. అందువల్ల పాలసీ తీసుకునే సమయం, మినహాయింపులను పరిశీలించడం ముఖ్యం.

పత్రాలను భద్రపరచుకోవాలి: విమాన టికెట్లు, హోటల్ బుకింగ్ వివరాలు, చెల్లింపు రసీదులు, విమానయాన సంస్థ నుంచి అందిన ఆలస్యం లేదా రద్దు ధ్రువీకరణలను భద్రపరచాలి. వీటిని డిజిటల్ రూపంలో ఫోన్‌లో లేదా క్లౌడ్ స్టోరేజీలో ఉంచుకోవడం వల్ల క్లెయిమ్ సమయంలో ఉపయోగపడుతుంది.

బీమా సంస్థకు వెంటనే సమాచారం ఇవ్వాలి: వాతావరణం కారణంగా ప్రయాణానికి అంతరాయం కలిగితే.. బీమా సంస్థను సంప్రదించి క్లెయిమ్ ప్రక్రియ, అవసరమైన పత్రాల వివరాలను తెలుసుకోవాలి. నిర్ణీత గడువులో క్లెయిమ్ దాఖలు చేయడం ద్వారా ప్రక్రియ సజావుగా సాగేందుకు అవకాశం ఉంటుంది.

నిబంధనలు తెలుసుకోవడమే కీలకం

వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రయాణ ప్రణాళికల్లో అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో ట్రావెల్ ఇన్సూరెన్స్ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. అయితే ప్రతి పాలసీలోనూ అన్ని రకాల వాతావరణ అంతరాయాలకు కవరేజీ ఉండదు. మినహాయింపులు, పరిహార పరిమితులు, వేచి ఉండాల్సిన సమయం, క్లెయిమ్ నిబంధనలు వేర్వేరుగా ఉంటాయి. అందువల్ల పాలసీ తీసుకునే ముందే వాటిని పూర్తిగా పరిశీలించాలి. తగిన కవరేజీని ఎంచుకోవడం ద్వారా అనుకోని ప్రయాణ అంతరాయాల వల్ల కలిగే ఆర్థిక నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చు.

> కొత్త ప్రాంతాలను సందర్శించడం, సరికొత్త అనుభవాలను మూటగట్టుకోవడం ప్రతి ప్రయాణికుడికీ ఉత్సాహాన్నిస్తుంది. అయితే ప్రస్తుత తరుణంలో అనూహ్య వాతావరణ మార్పులు ఆ ఉత్సాహంపై నీళ్లు చల్లుతున్నాయి. అకస్మాత్తుగా విరుచుకుపడే తుపానులు, తీవ్రమైన ఎండలు, వరదలు, పొగమంచు, కార్చిచ్చుల వంటి ప్రతికూల పరిస్థితులు ప్రయాణాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి అనిశ్చిత పరిస్థితుల వల్ల ఏర్పడే భారీ ఆర్థిక నష్టాలను నివారించుకోవడానికి సమగ్రమైన 'ట్రావెల్ ఇన్సూరెన్స్' తప్పనిసరి అని బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ (రిటైల్ బిజినెస్) రాకేశ్ కౌల్ స్పష్టం చేశారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం..

వేములవాడ ఆసుపత్రికి ఆధునిక హంగులు!

-మోకాళ్ల ఆపరేషన్లకు సీ-ఆర్మ్.. చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు.

వేములవాడ, అక్టోబరు 09 (ప్రజా కలం ప్రతినిధి) :

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే ఆరోగ్య సమస్యలను తొలిదశలో గుర్తించి చికిత్స అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో మోకాళ్ల శస్త్రచికిత్సలకు అవసరమైన సీ-ఆర్మ్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. వినికిడి పరీక్షలు, ఫిజియోథెరపీ వంటి సేవలను కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వేములవాడ ఏరియా ఆసుపత్రి ఆవరణలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు,జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు,ఆసుపత్రిలో బేరా యంత్రాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకొచ్చారు. పోషకాహార ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన వివిధ ఆహార పదార్థాల ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన పేదలకు మోకాళ్లకు సంబంధించిన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆపరేషన్లకు అవసరమైన సీ-ఆర్మ్ మిషన్ అందుబాటులో లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి



తీసుకెళ్లగా, తాజాగా యంత్రాన్ని సమకూర్చినట్లు చెప్పారు. దీంతో స్థానికంగా వైద్య సేవలను మరింత విస్తరించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. భవిష్యత్తులోనూ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలు పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.చిన్నారుల్లో వినికిడి లోపం, మాటలు రాకపోవడం, శారీరక ఎదుగుదలలో సమస్యలు తదితర లోపాలను చిన్న వయసులోనే గుర్తించడం ముఖ్యమని ఆది శ్రీనివాస్ అన్నారు. అవసరమైన వారికి ఫిజియోథెరపీ, వైద్య పరీక్షలు అందించడంతో పాటు ఉన్నత వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్, సరోజినీదేవి, ఈఎన్‌టీ ఆసుపత్రులకు పంపేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పేదరికం కారణంగా ఏ చిన్నారికీ వైద్యం అందకుండా పోకూడదని, ఈ దిశగా ప్రత్యేక సేవలు అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల సంరక్షణలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి నెలా చిన్నారుల ఎత్తు, బరువు నమోదు చేసి, ఎదుగుదలకు అనుగుణంగా పోషకాహారం అందించాలని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు వంటి పోషక విలువలున్న ఆహార పదార్థాలను తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు, వినికిడి సమస్యలు, రక్తహీనత, పోషకాహార లోపం, నడవలేకపోవడం, పుట్టుకతో వచ్చే వైకల్యాలు గుర్తించిన వెంటనే సమీప అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తారని, ఆర్‌బీఎస్‌కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి సేవలు అందిస్తారని వివరించారు. అవసరమైన చిన్నారులకు హైదరాబాద్‌లో ఉన్నత వైద్యం అందించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి మంగళ వారం '10 నిమిషాలు' కార్యక్రమం నిర్వహిస్తూ కేంద్రాల వసతులు, పోషకాహార పంపిణీ, బాలల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, ఆటపాటల ద్వారా విద్యాబోధనతో పాటు పోషకాహారం అందేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్ లోకేశ్, తహసీల్దార్ జయంత్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో ఆరా

- జీహెచ్ఎంసీ అధికారులకు సబితమ్మ ఆదేశాలు
- జింకల బావి కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్న - మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం , అక్టోబర్ 09 (ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని సరూర్ నగర్ డివిజన్, డాక్టర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని జింకల బావి కాలనీలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గురువారం పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ తదితర అంశాలపై కాలనీవాసులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ మహిళలకు రూ.లక్ష ఆర్థిక సహాయం మంజూరు

మైనంపల్లి హనుమంతరావు సహకారంతో లబ్ధిదారులకు ప్రయోజనం

మల్కాజిగిరి, అక్టోబరు 9 (ప్రజా కలం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద మల్కాజిగిరికి చెందిన ఫాతిమా, ఇక్రమునిస బేగంలకు రూ.50 వేల చొప్పున మొత్తం రూ.లక్ష ఆర్థిక సహాయం మంజూరైంది. కుట్టుపని, బోటిక్ వ్యాపారాల ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం 100 శాతం రాయితీపై



ఈ ఆర్థిక సహాయాన్ని అందించింది.

మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సంపత్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి 183 డివిజన్ లబ్ధిదారులకు ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు కృషి చేయడంతో పాటు, వారికి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం ఉపాధితో తమ కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు.

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జి.కాంతమ్మ ఈ నెల 8న ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరు ఉత్తర్వులు జారీ చేశారు. మంజూరైన మొత్తాన్ని నిర్దేశించిన స్వయం ఉపాధి కార్యకలాపాలకే వినియోగించాలని, వ్యాపారం ప్రారంభించిన అనంతరం వినియోగ ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత అధికారులకు సమర్పించాలని ఉత్తర్వుల్లో చెప్పారు.ఈ కార్యక్రమంలో గౌస్, ఆసిఫ్, కొండగౌడ్, సుధాకర్, మహేందర్ గౌడ్, గణేష్, నగేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చరణ్‌జిత్ గౌడ్, సంజయ్, పార్థసారథి, నరేష్ సచారి, రాజు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

నవజీవన్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల సందడి

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా వేడుకలు



మెదక్ అక్టోబర్ 09 (ప్రజాకలం ప్రతినిధి) మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకి నవజీవన్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల ప్రాంగణం బతుకమ్మలతో పండుగ శోభ సంతరించుకుంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ప్రధానోపాధ్యాయులు మహేష్ సార్ , బాబు సార్ తెలిపారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జమ్మి వృక్ష పరిరక్షణకు సంతోష్‌కుమార్ పిలుపు

- ఊరూరా జమ్మి చెట్టు.. - గుడిగుడికో శమీ వృక్షం
- గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో ఆరో ఏడాది కార్యక్రమం
- కుకునూరుపల్లిలో జమ్మి మొక్క నాటిన సంతోష్‌కుమార్, యాదవ రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ నియోజకవర్గం:

అక్టోబర్ 09 (ప్రజా కలం ప్రతినిధి):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్ట స్థానం కలిగిన జమ్మి వృక్షాన్ని సంరక్షించడంతో పాటు ప్రతి గ్రామంలో, ప్రతి దేవాలయంలో జమ్మి మొక్కలు నాటాలనే లక్ష్యంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో 'ఊరూరా జమ్మి చెట్టు. గుడిగుడికో జమ్మి చెట్టు' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల కేంద్రంలోని వారాహి, ప్రత్యంగిరా ఆలయంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్,ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి,బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు శమీ వృక్షాన్ని నాటారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.జమ్మి వృక్ష ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు దాని సంరక్షణపై అవగాహన కల్పించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్ర వృక్షాన్ని సంరక్షించాలి



తెలంగాణ రాష్ట్ర వృక్షంగా గుర్తింపు పొందిన జమ్మి చెట్టును సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు.జమ్మి వృక్షానికి ఉన్న ఆధ్యాత్మిక,సాంస్కృతిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో, ప్రతి ఆలయంలో శమీ మొక్కలు నాటాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, దేవాలయాలకు జమ్మి మొక్కలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో విజయదశమి రోజున జమ్మి చెట్టును పూజించడం,జమ్మి ఆకులను బంధుమిత్రులకు అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం సంప్రదాయంగా వస్తోందన్నారు.ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలంటే మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

కేసీఆర్ ఆలోచనతో హరిత ఉద్యమం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా గుర్తించిన విషయాన్ని సంతోష్‌కుమార్ గుర్తుచేశారు.జమ్మి వృక్షాన్ని గ్రామాలు, దేవాలయాలు,పాఠశాలల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయాలను కాపాడుకోవచ్చన్నారు.2018లో ప్రారంభమైన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.యువత,విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థలను భాగస్వాములను చేస్తూ మొక్కలు నాటడం,పెంచడాన్ని పెంపొందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర సమన్వయకర్త చెప్యాల రాజేశ్వర్‌రావు,పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్కా అమరేందర్,బీఆర్ఎస్ నాయకులు భట్టు అంజిరెడ్డి,జుబేర్, రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్,ఏఎంసీ మాజీ చైర్మన్ మదాను శ్రీనివాస్, వుల్కంవల్లి నరేందర్,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు భద్రప్ప,అనంతుల ప్రశాంత్, సంపత్,సర్పంచ్ మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి.

- ఓట్ చోరీకి పాల్పడుతున్న కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి .
- రాహుల్ గాంధీ కి మద్దతుగా సంగారెడ్డి లో జగ్గారెడ్డి 'సేవ్ అవర్ ఓట్స్' అనే వినూత్న కార్యక్రమం..
- జగ్గారెడ్డి ఆధ్వర్యం లో సంగారెడ్డిలో బ్యాలెట్ బాక్స్ ఉద్యమం
- ఓటర్ల పేర్లు, బూత్ నంబర్లు, సందేశాలతో బ్యాలెట్ బాక్స్‌లో వినతులు.. ఓటు హక్కు పరిరక్షణ పోరాటానికి సంఘీభావం

సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 09(ప్రజా కలం):

రాహుల్ గాంధీ ని ఇదే విషయంలో రాష్ట్రపతి ని కలిశారు, ఆయనకు మద్దతుగా సంగారెడ్డి నుండి రాష్ట్రపతి కి ఓట్ కార్డు లు పంపిస్తున్నాను ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంగారెడ్డిలో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. 'సేవ్ అవర్ ఓట్స్' పేరుతో ప్రత్యేకంగా రూపొందించిన బ్యాలెట్ బాక్స్ ద్వారా ప్రజలు తమ సంఘీభావాన్ని తెలియజేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ పేర్లు, పోలింగ్ బూత్ నంబర్లు రాసి, తమ ఓట్లను కాపాడాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేస్తూ సందేశాలను బ్యాలెట్ బాక్స్‌లో వేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి తాము అండగా ఉన్నామని ఈ సందేశాల ద్వారా తెలియజేశారు. ఓటు హక్కు పరిరక్షణ అనేది కేవలం రాజకీయ నాయకులకు సంబంధించిన అంశం కాదని, ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కులకు సంబంధించిన విషయమని ఈ కార్యక్రమం ద్వారా జగ్గారెడ్డి



చాటిచెప్పే ప్రయత్నం చేశారు. ప్రజల నుంచి నేరుగా సందేశాలను సేకరించడం ద్వారా ఓటు హక్కుల పరిరక్షణకు క్షేత్రస్థాయిలో మద్దతును కూడగట్టడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ

"ఓటు హక్కు పౌరుడి గొంతుక. ఆ ఓటును కాపాడుకోవడం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడంతో సమానం. సంగారెడ్డి ప్రజలు ఈ కార్యక్రమం ద్వారా రాహుల్ గాంధీకి బలమైన సందేశాన్ని పంపించారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న పోరాటంలో తామంతా భాగస్వాములమని చాటిచెప్పారు. ఇది ఒక్క నాయకుడి పోరాటం కాదు.. ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కును కాపాడుకునేందుకు సాగుతున్న సమష్టి పోరాటం."

వినూత్న కార్యక్రమం ద్వారా రాహుల్ గాంధీ ఓటు హక్కుల పరిరక్షణ పోరాటానికి ప్రజల మద్దతును తెలియజేయడంతో పాటు, ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన అవసరాన్ని జగ్గారెడ్డి గుర్తు చేశారు.తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో 73 లక్షల ఓట్లను తొలగించారని, 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. ఓట్ల చోరీ కారణంగానే బీజేపీ ఎంపీలు గెలుస్తున్నారని, వారి మద్దతుతో మోడీ ప్రధాని అవుతున్నారని విమర్శించారు. ఇదే పద్ధతిలో నాలుగోసారి ప్రధాని అయ్యేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మోడీ, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజల ఓట్లను చోరీ చేస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. కొన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చేందుకు ఓట్లను దొంగిలించే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. దేశ పౌరుల హక్కులను, ముఖ్యంగా ఓటు హక్కును పరిరక్షించేందుకు రాహుల్ గాంధీ పోరాడుతున్నారని పేర్కొన్నారు.

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆపబోనని రాహుల్ గాంధీ ప్రకటించారని జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీ తన కుటుంబ సభ్యులతో కలిసి ఢిల్లీ వీధుల్లో ఆందోళనలు చేస్తున్నారని, ఓటు హక్కు పరిరక్షణ అంశంపై రాష్ట్రపతిని కలవనున్నారని చెప్పారు. ఆయన పోరాటానికి సంఘీభావంగా సంగారెడ్డిలో నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. "జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి.. ప్రజల ఓటు హక్కును కాపాడాలి" అని డిమాండ్ చేశారు.

సారూ.. ఇక మీరు రారా?

- గజ్వేల్ సమస్యలకు పరిష్కారం లేదా?
- ఎమ్మెల్యే కేసీఆర్‌పై కొట్టాల యాదగిరి ముదిరాజ్ విమర్శలు
- కేబినెట్ ర్యాంకు హోదా పొంది ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు
- కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాల నుంచి రోడ్లు, వైద్యం వరకు ఎన్నో సమస్యలు



గజ్వేల్: అక్టోబర్ 09 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ ప్రజలు నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన ఎమ్మెల్యే కేసీఆర్ నియోజకవర్గ సమస్యలను పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ విమర్శించారు. ప్రజల ఆశీస్సులతో కేబినెట్ ర్యాంకు హోదా పొందిన కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం దురదృష్టకరమని ఎద్దేవా చేశారు.శుక్రవారం గజ్వేల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కేసీఆర్ నిర్లక్ష్యం కారణంగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాల అమలులో జాప్యం జరుగుతోందని యాదగిరి ఆరోపించారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన రింగ్‌రోడ్డు నిరుపయోగంగా మారిందని విమర్శించారు.గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ ఇప్పటివరకు సుమారు రూ. 2 కోట్ల మేరకు వివిధ రూపాల్లో ప్రభుత్వ నిధులు,సదుపాయాలు పొందారని పేర్కొన్నారు.ఆయన కోసం నిర్మించిన క్యాంపు కార్యాలయం పార్టీ నాయకుల జల్సాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు.

ప్రజల సమస్యలు పట్టించుకునేదెవరు?

కేసీఆర్ వస్తారని,తమ సమస్యలు పరిష్కరిస్తారని గజ్వేల్ ప్రజలు ఎదురుచూస్తున్నారని యాదగిరి అన్నారు. అయితే నియోజకవర్గంలోని పేదలు,బడుగు,బలహీన వర్గాల ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ అడిగితేనే నిధులు ఇస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని పేర్కొంటూ,మరి మల్లన్నసాగర్,కొండపోచమ్మసాగర్ నిర్వాసితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.సర్వం కోల్పోయి పునరావాస కేంద్రాలకు వచ్చిన నిర్వాసితుల పట్ల గత బీఆర్ఎస్ ప్రభుత్వం సరిగా వ్యవహరించలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భవనాలు వినియోగానికి నోచుకోకుండా అలంకారప్రాయంగా మారాయని,ఆసుపత్రుల్లో సమస్యలు పేరుకుపోయాయని ఆరోపించారు. మహతి ఆడిటోరియంను అద్దెకు ఇవ్వడంపైనా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

అభివృద్ధి ఎక్కడ.. ప్రజలకు పరిష్కారం ఎప్పుడు?

అభివృద్ధి పేరుతో ప్రభుత్వ నిధులు వక్కడారి వట్టాయని యాదగిరి ఆరోపించారు.నియోజకవర్గంలో విద్యుత్, తాగునీరు, వైద్యం, రహదారులకు సంబంధించిన సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని అన్నారు.గజ్వేల్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, ఆయన నియోజకవర్గానికి వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రజలను సమాయత్తం చేస్తామని యాదగిరి తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో తమ వంతు పాత్ర పోషిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు,లింగని రాజు,కూరాకుల శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, స్వామి, కనక సేన,కుమార్,కరుణాకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com



మహేశ్వరంలో ఐఎన్టిసియూ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించిన టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 09, (ప్రజా కలం):

టీజీఎస్ఆర్టీసీ యూనియన్ గుర్తింపు ఎన్నికల సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ డిపోలోని పోలింగ్ కేంద్రాన్ని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి గారు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ – ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధన, వారి సంక్షేమం మరియు డిపో అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఐఎన్టిసియూ యూనియన్ కే కార్మిక సోదరులంతా తమ అమూల్యమైన ఓటు వేసి మద్దతు తెలపాలని కోరారు. ఎల్లవేళలా కార్మికుల సమస్యలపై పోరాడుతూ వారి పక్షాన నిలబడే ఏకైక శక్తి మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఐఎన్టిసియూ గెలుపు కార్మికుల గెలుపు అని, అందరూ ఐక్యంగా ఐఎన్టిసియూ ని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టిసియూ నాయకుడు నడికుడి శివ, వైస్ చైర్మన్ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి, ఈశ్వర్,ఆవుల యాదయ్య, ఉప్పుగడ్డ తండా సర్పంచ్ రాజు, ఆంధ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

22వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

రంగంపేట అక్టోబర్ 9 (ప్రజా కలం ప్రతినిధి)

రంగంపేట గ్రామంలో 22వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గ్రామ ప్రముఖులు, నిర్వాహకులు ఘనంగా ఆవిష్కరించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ప్రచారంలో భాగంగా కరపత్రాలను ఆవిష్కరించి, వేడుకల వివరాలను



తెలియజేశారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలను ఈసారి కూడా భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేపడుతున్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ఉత్సవాలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరిగే స్వర్ణలత విజయ్ కుమార్, బొద్దుల రమేష్ బాబు, పోలంపల్లి బిక్షపతి, ముప్పిడి కృష్ణ, ఊరడి విజయ్ ప్రకాష్, ఉప సర్పంచ్ చిట్ముల సురేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు, పాడేపు వెంకట్, గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నేతిని శ్రీనివాస్, అల్లి చందు, గోకని సాయ గౌడ్, గంపల నవీన్ కుమార్, కరెంట్ వినోద్, పద్మ సత్యం, గోకని పవన్ గౌడ్, మల్లికార్జున్, గ్రామ వాడు సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దసరా కానుకగా వస్త్రాలు

రెండో వార్డులో పారిశుద్ధ్య సిబ్బందికి బట్టలు అందజేసిన కౌన్సిలర్ గోలీ మమత సంతోష్

గజ్వేల్: అక్టోబర్ 09 (ప్రజా కలం ప్రతినిధి):

దసరా పండుగను పురస్కరించుకుని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ





పరిధిలోని రెండో వార్డులో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వార్డు కౌన్సిలర్ గోలీ మమత సంతోష్ వస్త్రాలను అందజేశారు. ప్రతిరోజూ వార్డులో పారిశుద్ధ్య నిర్వహణ,పరిసరాల పరిశుభ్రత కోసం శ్రమించే కార్మికులతో పండుగ సంతోషాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని,ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిరంతరం శ్రమించే కార్మికులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. దసరా పండుగ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు అందజేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.





రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

- మహేశ్వరం ఏఈకి వినతిపత్రం అందజేసిన

-బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎర్ర పాండు

మహేశ్వరం, అక్టోబర్ 09 (ప్రజా కలం):


మహేశ్వరం మండల పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా మహేశ్వరం మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం మహేశ్వరం విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏ ఈ) కి బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎర్ర పాండు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్ర పాండు మాట్లాడుతూ – రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగు సమయంలో 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సాయంత్రం 6 గంటలకు కరెంటు పోయి తిరిగి ఉదయం 6 గంటలకు వస్తోందని, మధ్యలో కోతలు విధిస్తున్నారని తెలిపారు. దీంతో పంటలకు సకాలంలో నీరు అందించలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అంతేకాకుండా తక్కువ వోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ ఫెయిల్ అవుతున్నాయని, దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. రైతులు దేశానికి వెన్నెముక వంటివారని, రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని 24 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని, లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించి, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ చేపట్టాలని కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో బీజేపీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాతర్ల సుదర్శన్, బుగ్గని దేవేందర్, జనరల్ సెక్రటరీ గుర్రంపల్లి మల్లేష్, జి.ఎస్. జంగయ్య, రవీందర్, రెడ్డి బాలరాజ్, మహేందర్, ప్రవీణ్, జైపాల్ రెడ్డి, బండ బిక్షపతి, సాయినాథ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాంట్రాక్టు ఉపాధ్యాయురాలికి వేతనం అందజేత

- కేపీహెచ్‌బీలోని ప్రభుత్వ పాఠశాలకు చేయూత

కూకట్ పల్లి, అక్టోబర్ 09, ప్రజా కలం ప్రతినిధి:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి ఆదర్శమైన 'సేవా హీ సంఘటన్', 'జాతి ప్రథమం' స్ఫూర్తితోహా కేపీహెచ్‌బీలోని ప్రభుత్వ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయురాలి వేతనానికి ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని బిజెపి మేధ్చల్ అర్బన్ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ నర్వ పవన్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. శుక్రవారం కేపీహెచ్ బి కాలనీ భువన విజయం గ్రౌండ్ సమీపంలోని ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయురాలి వేతనాన్ని తన వంతు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా వేతనానికి సంబంధించిన చెక్ ను ఉపాధ్యాయురాలికి అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నరేంద్ర మోదీ స్ఫూర్తితోహావిద్యా రంగానికి తన వంతు సహాయ సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయురాలి వేతనాన్ని గత ఐదు సంవత్సరాలుగా తాను



అందిస్తున్నట్లు తెలిపారు. గుజరాత్ సీఎంగా మొదలై దేశ ప్రధానిగా మోదీ సాగించిన పాతికేళ్ల ప్రయాణం సుపరిపాలనకు, నిస్వార్థ సేవకు నిదర్శనమని పేర్కొన్నారు. నిజమైన సేవ మాటల్లో కాక చేతల్లోనే ఉంటుందని, అట్టడుగు స్థాయి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వికసిత భారత్-2047 లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ సమాజ సేవకు కట్టుబడాలని ఆయన పిలుపునిచ్చారు.

అక్టోబర్ 14న హైదరాబాద్ లో జరిగే కల్లుగీత కార్మికుల రాష్ట్ర సదస్సు ను జయప్రదం చేయండి - జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్



సంగారెడ్డి ప్రతినిధి
అక్టోబర్ 09(ప్రజా కలం):

కల్లుగీత కార్మిక సంఘం ఏర్పడి 69 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా హైదరాబాదులోని సుందరయ్య కళా నిలయంలో వార్షికోత్సవాలు, వృత్తిలో ఆధునీకరణ అంశంపై రాష్ట్ర సదస్సు అక్టోబర్ 14ననిర్వహిస్తున్నామని ఈకార్యక్రమాలను జయప్రదం చేయవలసిందిగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్ గీతకార్మికులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్ లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది అనంతరం కల్లుగీత కార్మిక సంఘం 69 వ వార్షికోత్సవాల కరపత్రం ను ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులు రాష్ట్రంలో 37వేల 381 మంది కొత్తగా దరఖాస్తు సంగారెడ్డి జిల్లాలో 585 మంది దరఖాస్తు చేసుకున్నారు వీరందరికీ ఎటువంటి షరతులు లేకుండా పెన్షన్ ఇవ్వాలని, వృత్తి చేసే వారందరికీ కంఠమయ్య రక్షణ కవచం ఇవ్వాలని కోరారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లు గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు ఇస్తామని, వృత్తిలో ఆధునీకరణ పద్ధతులు తీసుకువస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పిన దానిని ఆచరణలో అమలు చేయాలన్నారు. చెట్ల పెంపకానికి సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, నందనం లోని నీరా తాటి ఈత ఉత్పత్తుల ప్రాజెక్టు వెంటనే ప్రారంభించాలని, పెన్షన్ 4వేలు, ఎక్స్‌గ్రేషియా పది లక్షలకు పెంచాలని, ఏజెన్సీ ఏరియాలో సొసైటీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యలు, వృత్తిలో ఆధునీకరణ గురించి చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు రాష్ట్ర సదస్సు 14వ తేదీన సుందరయ్య కళానిలయంలో జరుగుతుందని దీనికి సొసైటీ అధ్యక్షులు, టి ఎఫ్ టి బాధ్యులు, గౌడ, గీత కార్మికులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు అంజా గౌడ్ జిల్లా కార్యదర్శి ప్రసాద్ గౌడ్ జిల్లా ప్రచార కార్యదర్శి వెంకటేశం గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు రామ గౌడ్ యాద గౌడ్ రవి గౌడ్ సంగారెడ్డి మండల ఉపాధ్యక్షులు కృష్ణా గౌడ్. జిల్లానాయకులు సాయ గౌడ్ శేఖర్ గౌడ్ కృష్ణ గౌడ్ నవీన్ గౌడ్. సుధాకర్ గౌడ్. మల్లేశం గౌడ్ సుధాకర్ గౌడ్ ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ యాదవ రెడ్డికి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వానం

గజ్వేల్ నియోజకవర్గం: .

అక్టోబర్ 9 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ నియోజకవర్గం లోని వర్గల్ శ్రీ విద్యా సరస్వతి దేవస్థానంలో ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రముఖులను ఆహ్వానించారు.ఇందులో భాగంగా శుక్రవారం ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఈ



కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంగిశెట్టి సుధాకర్, సిద్ది నవీన్, ప్రవీణ్ కుమార్,సంతోష్,మురళి పాల్గొన్నారు.



చెరువుల్లో మురుగునీరు కలవకుండా

చర్యలు చేపట్టాలి

- చెరువుల సుందరీకరణపై సబితమ్మ ఆదేశాలు

- మీర్‌పేట్ చెరువును ఆకస్మికంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించిన

-మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 09 (ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ ప్రాంతంలో ఉన్న చెరువును మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారు గురువారం ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. చెరువులోకి మురుగునీరు చేరుతుండటంతో పాటు, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆమె ఈ పర్యటన చేపట్టారు. చెరువులోకి డ్రైనేజీ నీరు చేరుతున్న పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారు మాట్లాడుతూ – మురుగునీరు చెరువులో కలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని హైడ్రా అధికారులకు సూచించారు. డ్రైనేజీ లైన్ల నుంచి వచ్చే నీరు, ఓవర్‌ఫ్లో కారణంగా చెరువు కలుషితం కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. చెరువు సుందరీకరణలో భాగంగా ఇంకా మిగిలి ఉన్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చెరువు పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన గ్రాండ్ మాస్టర్ డా టి గోపీ కృష్ణ కు అభినందన

కూకట్ పల్లి, అక్టోబర్ 09, ప్రజా కలం ప్రతినిధి:

హైదర్ నగర్ నిజాంపేట్ రోడ్ కు చెందిన కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు గ్రాండ్ మాస్టర్ డా టి గోపీ కృష్ణ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక రికార్డు ప్రయత్నంలో పాల్గొని తన మార్షల్ ఆర్ట్స్ ప్రతిభను చాటుకున్నారు.



2026 ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్ విభాగంలో కేవలం 20 నిమిషాల్లో 40 సార్లు కరాటే కటాను ప్రదర్శించారు. ఈ అధికారిక రికార్డు ప్రయత్నానికి సంబంధించిన సర్టిఫికెట్, పతకాన్ని సెప్టెంబర్ నాలుగో వారంలో అందుకున్నారు. ఈ సందర్భంగా కేపీహెచ్ బి పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌ను గ్రాండ్ మాస్టర్ డా టి గోపీ కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక ప్రయత్నానికి సంబంధించిన సర్టిఫికెట్, పతకాన్ని సీఐ కి చూపించారు. డా గోపీ కృష్ణ సాధించిన ఈ ఘనతను సీఐ జి విజయ్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మార్షల్ ఆర్ట్స్ రంగంలో ఆయన చేస్తున్న సేవలు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక రికార్డు ప్రయత్నంలో ఆయన భాగస్వామ్యం యువతకు, మార్షల్ ఆర్ట్స్ అభ్యాసకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని, కఠోర సాధన, పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాలను చేరుకోవచ్చని ఆయన ప్రయాణం తెలియజేస్తోందని విజయ్ కుమార్ అన్నారు.

ముస్తాబవుతున్న దేవి శరన్నవరాత్రి మండపాలు

- అమ్మవారి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

- భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలకు సన్నాహాలు

మెదక్ అక్టోబర్ 09 (ప్రజాకలం ప్రతినిధి):మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. అమ్మవారి మండపాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ,విద్యుత్ దీపాలతో అలంకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిర్వాహకులు చర్యలు చేపడుతున్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ ఉత్సవాలను ఈసారి కూడా ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా గ్రామస్తులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.





రాయపోల్ నూతన ఎస్ఐ బి.లింగంకు ఘనంగా సన్మానం.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 09.

ఇటీవల బదిలీపై రాయపోల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నూతన ఎస్ఐ బి.లింగంను బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రాజాగారి రాజాగౌడ్, నర్సింలు, శివ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి.లింగంను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలు, ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యల గురించి చర్చించారు. రాయపోల్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలపై మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రాజాగారి రాజాగౌడ్‌తో పాటు నర్సింలు, శివ పాల్గొన్నారు.



ఎండిపోతున్న వరి పంటలకు నీటి విడుదల.

రైతుల పంటలను కాపాడేందుకు సర్పంచ్ నిర్మల చొరవ.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 09.

రైతులు సాగు చేసిన వరి పంటలు నీటి కొరతతో ఎండిపోతున్న నేపథ్యంలో పంటలను కాపాడేందుకు అనాజిపూర్ గ్రామ సర్పంచ్ సోమని నిర్మల ఇస్తారి చొరవ చూపారు. శుక్రవారం రాయపోల్ మండలం అనాజిపూర్ గ్రామంలోని పెద్ద చెరువు నుంచి వరి పంటలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వరి పంట కీలక దశలో ఉన్న సమయంలో నీటి కొరత ఏర్పడటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంటలు ఎండిపోకుండా, దిగుబడిపై ప్రభావం పడకుండా ఉండేందుకు పెద్ద చెరువు నుంచి నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పంటలకు అవసరమైన సమయంలో నీటి సరఫరాపై సంబంధిత అధికారులు కూడా దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకన్న స్వామి, వెంకని మల్లేశం, అంకుల్‌గారి రాజు, రాచకొండ రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ ఔషధ పరిశోధనలో సత్తా

- రామిరెడ్డి ముదిరెడ్డికి రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ

పటాన్‌చేరు, అక్టోబర్ 9 (ప్రజా కలం) ప్రతినిధి.



మధుమేహ నియంత్రణకు కొత్త ఔషధాల అభివృద్ధి లక్ష్యంగా పరిశోధన చేసిన గీతం విశ్వవిద్యాలయ పరిశోధకుడు రామిరెడ్డి ముదిరెడ్డి రసాయన శాస్త్రంలో డాక్టరేట్‌కు అర్హత సాధించారు. హైదరాబాదులోని గీతం విజ్ఞాన శాస్త్ర పాఠశాలలో ఆల్ఫా గ్లూకోసిడేస్ నిరోధకాలుగా నూతన రసాయన సమ్మేళనాలపై పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. కొన్ని సమ్మేళనాలు అకార్బోస్ ఔషధం కంటే అధిక నిరోధక క్రియాశీలతను ప్రదర్శించినట్లు పరిశోధన మార్గదర్శకుడు ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల వెల్లడించారు. అయితే, వాటి భద్రత, ప్రభావశీలతపై మరిన్ని అధ్యయనాలు అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా గీతం హైదరాబాద్ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, విజ్ఞాన శాస్త్ర పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది రామిరెడ్డి ముదిరెడ్డిని అభినందించారు. ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల మార్గదర్శకత్వాన్ని ప్రశంసించారు..

బతుకమ్మలో సింధు సందడి..

- విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డి..

పటాన్‌చేరు, అక్టోబర్ 9 (ప్రజా కలం) ప్రతినిధి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రామచంద్రాపురంలోని వి. గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల నడుమ పాటలు, నృత్యాలతో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డి విద్యార్థినులతో కలిసి బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవం, ఐక్యతకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి వేడుకలతో భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు..



కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామి పవిత్రోత్సవాలు ఘనంగా ముగింపు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోరుకొండ స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో దివ్య పవిత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. శ్రీ వైఖానస భగవత్ ఆగమ శాస్త్ర ప్రకారం, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ప్రకారం ద్రవిడ ప్రబంధన, వేద పారాయణలతో ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీ వైఖానస ఆగమ పండితులు శ్రీమాన్ వాఖాని మణికంఠాచార్యులు వారి బ్రహ్మత్వంలో, స్వామివారి వంశపారంపర్య అర్చక స్వాములు శ్రీ పెదపాటి, శ్రీ పెద్దింటి, శ్రీ పెరవలి వారి పర్యవేక్షణలో, అనువంశిక ధర్మకర్త శ్రీమాన్ పరాశర రంగరాజా భట్టర్, కార్యనిర్వహణాధికారి నేతృత్వంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు.చివరి రోజు వేద పండితుల దివ్య మంత్రోచ్చారణల నడుమ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, సప్తదశ కలశప్రోక్షణ ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి శాంతి కళ్యాణం, విశేష నివేదన, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాదగోష్టి అత్యంత వైభవంగా జరిగాయి. చివరిగా పవిత్రమాలా ప్రసాద వితరణ, వేదాశీర్వచనం, యజ్ఞశాల దేవతా ఉద్వాసన, మంగళాశాసనములతో పవిత్రోత్సవాలు మంగళప్రదంగా పూర్తయ్యాయి.ఈ ముగింపు మహోత్సవంలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి , రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొని స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గారు మాట్లాడుతూ స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య పవిత్రోత్సవాల ఆఖరి రోజు పూజల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. కోరుకొండ స్వామివారి దివ్య ఆశీస్సులతో రాజానగరం నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నానని, క్షేత్ర సమగ్ర అభివృద్ధికి, భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తరపున శాయశక్తులా కృషి చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాఫీ లైజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలి - అక్టోబర్ 23 నుంచి నిరవధిక సమ్మెకు నోటీసు

పాడేరు : పాడేరు ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న కాఫీ లైజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించి, రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ అల్లూరి సీతారామరాజు జిల్లా సహాయ కార్యదర్శి లింగేరి సుందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్టోబర్ 23 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మకు సమ్మె నోటీసు అందజేశారు.పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో 2000 సంవత్సరం నుంచి 156 మంది కాఫీ లైజన్ కార్మికులు పనిచేస్తున్నారని సుందర్‌రావు తెలిపారు. కాఫీ ప్రాజెక్టు అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వారికి ప్రస్తుతం నెలకు కేవలం రూ.15 వేల వేతనం చెల్లించడం అన్యాయమన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో ఈ వేతనం కుటుంబాల కనీస అవసరాలకు కూడా సరిపోవడం లేదని పేర్కొన్నారు.

కార్మికుల ప్రధాన డిమాండ్లు:-

నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలి.- ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి.- విధి నిర్వహణలో ప్రమాదం జరిగితే ప్రమాద బీమా కల్పించాలి.- కార్మికుడు విధి నిర్వహణలో మృతి చెందితే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.- ప్రతి కార్మికుడికి నెలకు 10 లీటర్ల పెట్రోలు అందించాలి.- విధి నిర్వహణకు అవసరమైన రాత సామగ్రి ఖర్చులను ఐటీడీఏ భరించాలి.- రైతుల వివరాల నమోదు కోసం ఒక్కో రైతుకు అయ్యే రూ.15 ఖర్చును ఐటీడీఏ చెల్లించాలి.- ప్రతి కార్మికుడికి జీవిత బీమా, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలి.

తమ సమస్యలను ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపకపోవడం పట్ల సుందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.అక్టోబర్ 23లోగా సమస్యలను పరిష్కరించకపోతే కాఫీ లైజన్ కార్మికులు నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు తెలిపారు.

సమ్మెకు ముందే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్మిక సంఘం ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కాఫీ లైజన్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె. శ్రీను, ఉపాధ్యక్షులు బి. సింహాచలం, బి. శ్రీను, కె. వాషు, ఎన్. మల్లేష్, ఎస్. నాగేశ్వరరావు, ఎల్. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మస్క్ ఆరోపణల కలకలం...ఖండించిన కేంద్రం



న్యూఢిల్లీ : భారతదేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల విడుదలకు స్థానిక బిలియనీర్లు, ఆలిగార్క్‌లు అడ్డుపడుతున్నారంటూ టెక్ దిగ్గజం, స్టార్ లింక్ అధినేత ఎలాన్ మస్క్ చేసిన సంచలన ఆరోపణలకు కేంద్ర ప్రభుత్వం గట్టి కౌంటర్ ఇచ్చింది. సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న ఈ ఆరోపణలు, కథనాలను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖతీవ్రంగా ఖండించింది. భారత్‌లో శాటిలైట్ కమ్యూనికేషన్ సర్వీసులతో సహా అన్ని రకాల టెలికాం సేవలకు నిష్పాక్షికమైన, వివక్ష లేని పారదర్శక నిబంధనలను పక్కాగా అమలు చేస్తున్నామని స్పష్టం చేసింది.శాటిలైట్ ఇంటర్నెట్ విభాగానికి సంబంధించి జీఎంపీసీఎస్ పరిధిలో ఇప్పటివరకు మొత్తం మూడు దిగ్గజ సంస్థలకు టెలికాం లైసెన్సులు మంజూరు చేసినట్లు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. నాన్-జియోసింక్రోనస్ శాటిలైట్ ఆర్బిట్ ఆధారిత సేవలు అందించడానికి ఈ మూడింటికీ సమాన ప్రాతిపదికనే అవకాశాలు కల్పించామని పేర్కొంది. దేశంలో అత్యుత్తమ శాటిలైట్ సేవలను అందుబాటులోకి తేవాలనే కట్టుబాటుతోనే ఈ లైసెన్సింగ్ ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించింది.అయితే, లైసెన్స్ పొందిన ఏ సంస్థ అయినా సేవలను ప్రారంభించే ముందు భారత జాతీయ భద్రతా నిబంధనలకు లోబడి ఉందో లేదో నిరూపించుకోవాల్సి ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. వినియోగదారుల డేటా భద్రత, దేశ రక్షణ , డిజిటల్ భద్రతా ప్రమాణాలను కాపాడటమే ఈ నిబంధనల అసలు ఉద్దేశమని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం లైసెన్స్ పొందిన మూడు సంస్థలకు సంబంధించి ఈ భద్రతా తనిఖీలు, అంచనా ప్రక్రియ పురోగతిలో ఉందని సవివరంగా తెలిపింది.

జాతీయ భద్రతా తనిఖీల ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన తర్వాతే ఆయా సంస్థలు తదుపరి దశ అయిన స్పెక్ట్రమ్ కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హత సాధిస్తాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం అనుమతులు పొందిన మూడు సంస్థలు ఎలాన్ మస్క్ స్టార్‌లింక్‌తో సహా నిబంధనల ప్రకారం ఒకే రకమైన రెగ్యులేటరీ దశలో ఉన్నాయని, ఏ ఒక్క సంస్థకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం లేదా వివక్ష చూపడం జరగలేదని తేల్చిచెప్పింది.కాబట్టి, భారత రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ లేదా దాని అమలు తీరు పక్షపాతంగా, అన్యాయంగా ఉందంటూ ప్రచారం చేయడంలో ఏమాత్రం నిజం లేదని కేంద్రం తేల్చిచెప్పింది. ఇటువంటి వాదనలు పూర్తిగా నిరాధారమైనవని, తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని స్పష్టం చేసింది. ఎలాన్ మస్క్ ట్వీట్ ఆధారంగా సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారానికి కేంద్రం ఇచ్చిన ఈ వివరణతో నిబంధనల అమలులో అందరికీ ఒకే రూల్ వర్తిస్తుందనే సంకేతం గట్టిగా వెళ్లింది.

నిరుద్యోగులు, ఉద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్

బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

ఎర్రుపాలెం : ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను, సమస్యలు పరిష్కరిస్తామని ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వాటి అమలుపై మాట దాటవేస్తోందని విమర్శించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత, ఉద్యోగులు, పట్టభద్రులు కాంగ్రెస్ పాలనపై తమ అభిప్రాయాన్ని వెల్లడించనున్నారని తెలిపారు. ఎర్రుపాలెం మండలం మినవోలు గ్రామంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, ఇతర హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న యువతకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. పీఆర్సీ, డీఏలు, ఉద్యోగుల ఇతర సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. బూత్ స్థాయి నుంచే ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి, తోట శ్రీనివాసరావు, సర్పంచ్ వేల్పుల బెంజిమెన్, నాయకులు గూడూరు రమణారెడ్డి,

దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు హరీశ్‌రావుకు ఆహ్వానం

సిద్ధిపేటలో మాజీ మంత్రిని కలిసిన సూర్యవంశ ఆరెకటిక సంఘం సభ్యులు

గజ్వేల్: అక్టోబర్ 09 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో సూర్యవంశ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు



హాజరుకావాలని కోరుతూ సంఘం సభ్యులు శుక్రవారం సిద్ధిపేటలో మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఉత్సవాల వివరాలను ఆయనకు తెలియజేసి, ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్కార్ పద్మబాయి నర్సింగ్‌రావు,మాజీ కౌన్సిలర్ కళ్యాణ్కార్ శ్రీనివాస్, సూర్యవంశ ఆరెకటిక సంఘం సభ్యులు జమాల్‌పూర్ విఠల్, కళ్యాణ్కార్ మహేష్, జమాల్‌పూర్ ప్రదీప్,సాయి మహేష్, ఎర్రవాడ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి పిల్లలతో బతుకమ్మ సంబరాలు

చిన్నతనం నుంచే సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలి: సర్పంచ్ గుండెల వజ్రవ్వ

సిద్ధిపేట జిల్లా ప్రతినిధి:09 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామంలోని



అంగన్‌వాడి కేంద్రం-2లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడి చిన్నారులు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు.కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుండెల వజ్రవ్వ హాజరై చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలకు మన సంస్కృతి,సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించాలని అన్నారు.తద్వారా భవిష్యత్తులో వారు మన సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగుతారని పేర్కొన్నారు. చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆడటం ఆనందంగా ఉందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ కవిత, ఆయాలు పద్మ, మనెవ్వ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో బాణం జోరు

కార్మిక సంఘం ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్ విజయం

గజ్వేల్: అక్టోబర్ 09 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ బస్ డిపోలో సుదీర్ఘ విరామం తర్వాత నిర్వహించిన కార్మిక సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ) అభ్యర్థి 53 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. డిపో కార్మికులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగియడంతో యూనియన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం చేస్తున్న కృషిపై నమ్మకంతోనే తమ అభ్యర్థికి కార్మికులు మద్దతు తెలిపారని వారు పేర్కొన్నారు.విజయానికి సహకరించిన డిపో కార్మికులు,డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందికి యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని,వారి హక్కుల పరిరక్షణకు నిరంతరం అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.

